

పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాల చోరీ

రణస్థలం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు కట్టుదిట్టంగా నిర్వహించే నేపథ్యంలో పైడిభీమవరం హైస్కూల్‌లోని ఎనిమిది గదుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అయితే బుధవారం పరీక్ష అనంతరం గుర్తు తెలియని వ్యక్తులు ఆ కెమెరాలను చోరీ చేశారు. ఈ విషయమై ఉపాధ్యాయులు చుట్టు పక్కల ఆరా తీసినా.. సీసీ కెమెరాలు ఎవరు తీశారనేది తేలలేదు. దీనిపై సీఎస్ జగన్నాథరావు జేఆర్‌పురం పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ ఎస్.చిరంజీవి తెలిపారు.

కాలం చెల్లిన మందులు

- మెడికల్ షాపుల్లో 'ఆపరేషన్ గరుడ' తనిఖీలు
- జిల్లాలో 12 చోట్ల సోదాలు
- వైద్యుల సూచనలు లేని మందుల గుర్తింపు



శ్రీకాకుళంలో మందుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న విజిలెన్స్ ఎస్పీ ప్రసాదరావు



పలాసలో మందుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్ యుగంధర్, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సింహాచలం

శ్రీకాకుళం/ పలాస/ పాతపట్నం/ హిరమండలం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పోలీసు బాస్ ఆదేశాల మేరకు ఆపరేషన్ గరుడ కార్యక్రమంలో భాగంగా మందుల షాపులపై అధికారులు నిఘా పెట్టారు. జిల్లాలో రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఔషధ నియంత్రణ, పోలీసు, ఈగల్ బృందం సంయుక్తంగా శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు 12 దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. శ్రీకాకుళం, టెక్కలి, పలాస డివిజన్లలో సోదాలు చేశారు. మత్తు కోసం వినియోగించే మాత్రలు.. ఇతర మందుల విక్రయాలపై ఆరాతీశారు. పలాసలో కాలం చెల్లినవాటిని, వైద్యుల సలహా లేకుండా ఇస్తున్న మందులను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొని కేసు నమోదు చేశారు. అలాగే పాతపట్నం, హిరమండలంలోని మందుల షాపుల్లోనూ తనిఖీలు చేశారు. అధిక దుకాణాల్లో మందుల విక్రయాలకు సంబంధించి వినియోగదారులకు బిల్లులు ఇవ్వడంలేదు. అలానే వైద్యుని చీటీ లేకుండానే మందుల విక్రయాలు జరుగుతున్నాయి. అన్నింటికంటే మెడికల్ షాపుల్లో ఉండాల్సిన ఫార్మాసిస్ట్.. అక్కడ అందుబాటులో లేకపోవడం.. మరొకరు మందులను విక్రయించడం వంటివి గుర్తించారు. వీటిపై ప్రభుత్వానికి నివేదికను పంపనున్నారు. త్వరలోనే చర్యలు తీసుకునే అంశముంది.



హిరమండలంలో మందులను పరిశీలిస్తున్న 'ఈగల్' టీమ్

- పలాస-కాశీబుగ్గ జంటపట్టణాల్లో రెండు షాపుల్లో అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఔషధ దుకాణాల సంఘం అధ్యక్షుడు నిర్వహిస్తున్న తర్లాన వాసుదేవరావు మెడికల్ స్టోర్‌లో కాలం చెల్లిన మందులు గుర్తించారు. దీంతోపాటు వైద్యుల సలహా లేకుండా ఇస్తున్న మందులను గుర్తించి కేసు నమోదు చేశారు. పట్టుకున్న మందులను సీజ్ చేసి తరలించారు. దాడుల నేపథ్యంలో జంట పట్టణాల్లో ఔషధ షాపుల యజమానులు బిల్లులు అప్‌డేట్ చేసే పనిలో నిమగ్నమయ్యారు. అలాగే కాలం చెల్లినవి, నాసిరకం మందులను ఇతర ప్రాంతాలకు తరలించారు.
- పాతపట్నంలో విజిలెన్స్ సీఐ డి. సింహాచలం ఆధ్వర్యంలో ఒక మందుల షాపును తనిఖీ చేశారు. పలు ప్రైవేటు క్లినిక్‌ల వద్ద ఉండే డ్రగ్స్‌ను పరిశీలించారు. షాపుల నిర్వహణ, స్టాక్ వివరాలు నమోదు చేశారు.
- హిరమండలంలోని ఒక మందుల దుకాణంలో తనిఖీ చేశారు. ఈగల్ (మిగతా 6వ పేజీలో..)

ఆస్పత్రి అనుబంధంగా ఉండేవి తనిఖీ చేస్తే..

ప్రైవేటు ఆస్పత్రులకు అనుబంధంగా ఉండే మెడికల్ షాపుల్లో తనిఖీలు నిర్వహించి ఉంటే అక్రమాలు వెలుగులోకి వచ్చేవి. ఎక్కువగా పీడీ కంపెనీల మందులే అంతటా అక్కడ ఉంటున్నాయి. సొంతంగా బ్రాండ్‌ల తయారీతో... హిమాచల్‌ప్రదేశ్ వంటి రాష్ట్రాలతో మ్యానుఫ్యాక్చరింగ్ చేయించిన మందులు అందుబాటులో ఉంటున్నాయి. వాటిని జిల్లాకు చెందినవారే సొంతంగా మార్కెటింగ్ చేసుకుని.. డాక్టర్‌లకు అధికశాతం మార్జిన్ ఇస్తూ.. విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇటువంటివాటిపై ఆపరేషన్ గరుడ దృష్టి సారించి ఉంటే.. ఈ మందులను కొన్ని శాంపిల్స్ తీసి.. ప్రయోగశాలకు పంపి ఉంటే అసలు లెక్క తేలేది. ప్రతి పీడీ కంపెనీలో మందుల నాణ్యత ఏరీతిన అన్నదో.. అటు డాక్టర్‌లకు.. ఇటు ఔషధ నియంత్రణ అధికారుల మనస్సాక్షికి తెలుసు. ఈరీతిన తనిఖీలు చేపట్టిఉంటే ఫలితముండేదని జిల్లాప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ ఆస్పత్రులపై నమ్మకం పెంచాలి

- రోగులతో స్నేహపూర్వకంగా మెలగాలి
- సమగ్ర ఆరోగ్య వివరాల నమోదు తప్పనిసరి
- డీఎంఈ డాక్టర్ రఘునందన్
- రిమ్స్ కళాశాల, ఆస్పత్రి సందర్శన

అరసవల్లి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): 'ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు స్నేహపూర్వకంగా సేవలు అందించాలి. ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రజల్లో నమ్మకం పెంచాలి. ప్రతీ రోగి యొక్క సమగ్ర ఆరోగ్య వివరాలను(ఈహెచ్ఆర్) తప్పనిసరిగా నమోదు చేయాల'ని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ రఘునందన్ ఆదేశించారు. శుక్రవారం ఆయన శ్రీకాకుళంలోని రిమ్స్ వైద్య కళాశాల, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి (జీజీహెచ్-రిమ్స్)ని కళాశాల ప్రిన్సిపాల్ రవి వెంకటాచలం, ఆస్పత్రి సూపరింటెండెంట్ దాసరి షకీలాతో కలిసి సందర్శించారు. ఎమర్జెన్సీ, ఆప్తాల్మిక్, చిన్నపిల్లల ఐసీయూ, సర్జికల్ వార్డు, గైనిక్ వార్డు, డీఈఐసీ, ఈఎన్‌టీ తదితర విభాగాలను పరిశీలించారు. రోగుల వివరాలు, అందిస్తున్న సేవలు, సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం రిమ్స్ కళాశాల సమావేశ మందిరంలో అన్ని విభాగాల అధిపతులతో సమీక్ష నిర్వహించారు. ముందుగా కళాశాలలో కొత్తగా చేరిన పీజీలను ఆయన అభినందించారు. ప్రజలకు మెరుగైన, అత్యుత్తమైన సేవలను స్నేహపూర్వక వాతావరణంలో అందిస్తామని అందరితో ప్రతిజ్ఞ చేయించారు.

- అనంతరం ఆయన మాట్లాడుతూ 'ప్రజలకు రిమ్స్‌లో లభించే సేవల వివరాలను, ప్రైవేటు ఆసుపత్రుల మాదిరిగా.. నగరంలోని ముఖ్యకూడళ్లలో అందరికీ కనిపించేలా పెద్దపెద్ద బోర్డులను ఏర్పాటు చేయాలి. ప్రభుత్వం వైద్యశాఖపై ప్రత్యేక దృష్టి సారించింది. వైద్యులు తప్పనిసరిగా ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఆస్పత్రిలో విధుల్లోనే ఉండాలి. రోగులతో స్నేహపూర్వకంగా మెలగి, వారికి ప్రభుత్వాసుపత్రులపై నమ్మకం కలిగించాలి. ఏవైనా ప్రత్యేకమైన, అరుదైన చికిత్సలు/శస్త్రచికిత్సలు ఆసుపత్రిలో నిర్వహిస్తే ప్రజలకు వాటిని తెలియజేయాలి. వైద్యపరికరాలు, సిబ్బంది నియామకాలు అవసరమైతే వాటి నివేదికను అందజేయాల'ని ఆదేశించారు. ఆసుపత్రి ఆవరణలో డిజిటల్ లైబ్రరీ, తరగతి గదులు, క్రిటికల్ కేర్ యూనిట్ బ్లాక్, నర్సింగ్ స్టాఫ్ బ్లాక్, వైద్య విద్యార్థులకు హాస్టల్ భవనాలు పూర్తయినా ఫర్నీచర్ లేక ప్రారంభానికి నోచుకోలేదని ప్రిన్సిపాల్ రవి వెంకటాచలం చెప్పగా, వెంటనే భవనాలను ప్రారంభించేందుకు తగు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో వివిధ వైద్య విభాగాల అధిపతులు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



రిమ్స్‌లో వైద్యబృందంతో మాట్లాడుతున్న డీఎంఈ డాక్టర్ రఘునందన్

పాలిటెక్నిక్‌తో భవితకు భరోసా
- దరఖాస్తుల స్వీకరణకు గడువు ఏప్రిల్ 15
- అదే నెల 30న పాలిసెట్

6లో

సేంద్రియ పంటలు @ బలియాపుట్టుగ
- రసాయన ఎరువుల వాడకానికి దూరంగా సాగు
- ప్రభుత్వ సహకారం అందించాలని వేడుకోలు

6లో

రోడ్ల నిర్మాణం త్వరితగతిన **పూర్తి చేయండి**
- మంత్రి అచ్చెన్నాయుడు

'తంపర'పై కల్వర్టు నిర్మాణంతో **పంటలకు ముప్పు**
- ఆందోళనలో రైతులు

8లో



మామిడిగుడ్డి రహదారి పనులను పరిశీలిస్తున్న క్వాలిటీ కంట్రోల్ అధికారి హరికృష్ణ

రహదారుల పనుల్లో.. నాణ్యత పరిశీలన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మెళియాపుట్టి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీడీఏ పరిధిలో రహదారి పనుల నాణ్యతను శుక్రవారం క్వాలిటీ కంట్రోల్ ఈఈ హరికృష్ణ ఆధ్వర్యంలో అధికారులు పరిశీలించారు. ఐటీడీఏ పరిధిలోని ఓ ఇంజనీరింగ్ అధికారి కాంట్రాక్టర్‌గా వ్యవహరిస్తూ.. నాణ్యతలోపంతో పనులు చేపట్టి.. బిల్లులు పక్కదారి పట్టిస్తున్నారనే ఆరోపణలున్నాయి. దీనిపై ఈ నెల 8న 'ఆంధ్రజ్యోతి'లో 'ఆ అధికారే కాంట్రాక్టర్' శీర్షికతో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. పనుల నిర్వహణపై గిరిజన సంక్షేమశాఖ ఈఎన్‌సీ శ్రీనివాసరావు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తోపాటు ఐటీడీఏ పీవో యశ్వంత్ కుమార్‌రెడ్డికి కొంతమంది వేర్వేరుగా ఫిర్యాదు చేసినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో రహదారుల పనుల నాణ్యతాప్రమాణాలు పరిశీలించి సమగ్ర నివేదిక ఇవ్వాలని క్వాలిటీ కంట్రోల్ ఈఈ హరికృష్ణను ఉన్నతాధికారులు ఆదేశించారు. ఈ మేరకు గురు, (మిగతా 6వ పేజీలో..)

మహిళామార్ట్‌లో అనకొండలు!



- నరసన్నపేటలోని మహిళా మార్ట్ ఇది. మండలంలో 47 గ్రామ మహిళా సమాఖ్య సంఘాల్లో 22,500 మంది సభ్యులు ఉన్నారు. వీరి వద్ద ఒక్కొక్కరి నుంచి రూ.110 చొప్పున షేర్ క్యాపిటల్ వసూళ్లు చేశారు. మొత్తంగా రూ.24.50లక్షలతో 2022 డిసెంబర్‌లో మహిళా మార్ట్ ఏర్పాటు చేశారు. ఈ మార్ట్ నాడు కళకళలాడేది. రోజుకు రూ.30వేల నుంచి రూ.50వేల వరకు వ్యాపారాలు జరిగేవి. ఈ మార్ట్‌పై అవినీతి అనకొండల దృష్టి పడడంతో కేవలం రెండేళ్లలోనే సరుకులన్నీ మాయమయ్యాయి. వెలుగులో కొంతమంది అధికారులు, మండల మహిళా సమాఖ్య (ఎంఎంఎస్) సభ్యుల చేతివాటం కారణంగా.. నేడు వ్యాపారాలు లేక మూత దశలో ఉంది. దీనిపై మహిళా సంఘాల సభ్యులు ఆవేదన చెందుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు. తమ షేర్ క్యాపిటల్ నిధులను లాభాలతోపాటు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.

- స్వయం సహాయక సంఘ సభ్యుల పెట్టుబడి నిధులు బొక్కేసిన వైనం
- వెలుగులో అధికారులు, ఎంఎంఎస్ సభ్యుల చేతివాటం
- నిర్వహణ పేరిట రూ.లక్షల్లో మూలధనం పక్కదారి
- మండల మహిళా సమాఖ్య, స్త్రీ నిధి రుణాల్లోనూ అదే తీరు

నరసన్నపేట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): నరసన్నపేటలోని మహిళా సమాఖ్య సంఘాల సొమ్ముతో ఏర్పాటు చేసిన మహిళా మార్ట్‌లో అవినీతి అనకొండలు పడ్డాయి. నిర్వహణ పేరిట రూ.లక్షల్లో నిధులు హాంఫట్ చేశాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో 2022 డిసెంబరు 14న అప్పటి డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్.. నరసన్నపేటలోని వెలుగుకు చెందిన భవనంలోనే మహిళా మార్ట్‌ను ప్రారంభించారు. ఈ భవనం మరమ్మతులు, మహిళా మార్ట్ ఏర్పాటుకు అవసరమైన ఫర్నీచర్, కంప్యూటర్ ఇతర ఖర్చులకు కూడా మహిళా సమాఖ్య నిధులు వెచ్చించారు. మార్ట్‌లో సరుకుల కోసం డ్వాక్రా సంఘాల సభ్యుల నుంచి రూ.110 చొప్పున క్యాపిటల్ షేర్ పేరుతో వసూలు చేశారు. ఇలా నరసన్నపేట మండలంలో 47 గ్రామ సమాఖ్య సంఘాల పరిధిలో 22,500 మంది సభ్యుల నుంచి రూ.24.50 లక్షలు సేకరించారు. వీటితో సరుకులు ఏర్పాటు చేశారు. అలాగే డ్వాక్రా సంఘాలు తయారు చేసిన వస్తువులు కూడా ఈ మార్ట్‌లో విక్రయించేవారు. అప్పట్లో రోజువారీ విక్రయాలను ప్రోత్సహించేందుకు ఇతర మండలాల్లో ఉన్న మహిళా సంఘాల సభ్యులు కూడా ఇక్కడ మహిళామార్ట్‌లో కొనుగోలు చేసేవారు. రోజూ సుమారు రూ.30వేల నుంచి రూ.50వేల వరకూ వ్యాపారాలు సాగేవి. మండల సమాఖ్య నిధులు, స్త్రీనిధి రుణాలతో లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టారు. ఈ మార్టుపై అక్రమార్కుల దృష్టి పడింది. వెలుగులో కొంత మంది అధికారులు, ఎంఎంఎస్ సభ్యులు పక్కా ప్రణాళికతో మార్ట్‌లో ప్రవేశించి నిధుల దోపిడీకి పాల్పడ్డారు. ముగ్గురు వ్యక్తులు దీని నిర్వహణ పేరిట నెలకు రూ.లక్ష నుంచి రూ.2లక్షల వరకూ బొక్కడం ప్రారంభించారు. మార్ట్‌లో పనిచేసే సిబ్బందిని నియమించకుండానే.. వారు ఉన్నట్టు లెక్కలో చూపి డబ్బులు దోచేశారు. క్రమేపీ సరుకులు కూడా ఖాళీ చేసేశారు. విక్రయాల ద్వారా వచ్చిన ఆదాయంలో కూడా 5 నుంచి 10 శాతం కనిపించకుండా చేశారనే ఆరోపణలు ఉన్నాయి. గ్రామాల్లో స్వయంశక్తి సంఘాల సభ్యులకు బలవంతంగా సరుకులను విక్రయించేవారు. అలా గత రెండు నెలలుగా మార్టు మొత్తం ఖాళీ అయ్యింది. గత ప్రభుత్వ హయాంలో ఉన్న అధికారులు, సభ్యులు కొంతమేరకు హాంఫట్ చేశారు. అప్పటి నుంచి ఉన్న ఒక అవినీతి అనకొండ ఈ మార్ట్ సొమ్మును కాజేసినట్టు సమాచారం.

అన్నీ తప్పుడు లెక్కలే..

మార్ట్ ప్రారంభోత్సవానికి, మార్ట్‌లో రేకులు, సీసీ కెమెరాలు, కంప్యూటలర్లు ఇతర సామగ్రి కోసం రూ.9లక్షలు ఖర్చయినట్టు లెక్కల్లో చూపారు. వాస్తవంగా వీటి కోసం రూ.3లక్షల నుంచి రూ.4 లక్షల వరకు మాత్రమే ఖర్చు చేశారు. మార్ట్ ఏర్పాటు చేసిన భవనానికి అంతకుముందు ఎంఎంఎస్ నిధుల నుంచి రూ.3 లక్షలు ఖర్చు చేశారు. ఈ విధంగా గత ప్రభుత్వ హయాంలో మార్ట్ ఏర్పాటుకు రూ.12లక్షల వరకు ఖర్చు చేసినట్లు లెక్కల్లో చూపించి అక్రమార్కులు భారీగా నిధులు మింగేశారనే ఆరోపణలు ఉన్నాయి.

మండల మహిళా సమాఖ్యలో అక్రమాలు..

మార్ట్ నిర్వహణతోపాటు స్వయంశక్తి సంఘాలకు ఇచ్చే వివిధ శిక్షణకు, ఇతర నిర్వహణకు భారీ స్థాయిలో ఖర్చులు పెట్టినట్లు రికార్డుల్లో చూపించి మండల మహిళ సమాఖ్య నిధులు దుర్వినియోగానికి పాల్పడ్డారు. గత ప్రభుత్వ హయాంలో మొదలైన అక్రమాలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. స్త్రీ నిధి రుణాల్లో కూడా లక్షలాది రూపాయలు (మిగతా 6వ పేజీలో..)

తీరనున్న నీటి కష్టాలు

- ఉద్దానం రక్షిత నీటి పథకం అమలుకు శ్రీకారం
- వారం రోజుల్లో పైపులైన్ల పనులు ప్రారంభం
- ఫలించిన పలాస ఎమ్మెల్యే శిరీష కృషి

పలాస, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీ ప్రజలకు నీటి కష్టాలు ఉద్దానం రక్షిత మంచినీటి పథకం ద్వారా తీరనున్నాయి. హిరమండలం నుంచి పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాలకు సమగ్ర నీటి పథకం ద్వారా తాగునీరు అందిస్తున్నా, పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీకి అందడం లేదు. సొంత నీటి పథకాలు లేక జంట పట్టణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే గౌతు శిరీష స్పందించి.. ఉద్దానం రక్షిత నీటి పథకం ద్వారా నీరు ఇస్తే ప్రజల కష్టాలు తీరుతాయని అధికారులకు, రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవించారు. దీనిపై ఇటీవల అసెంబ్లీ సమావేశాల్లో కూడా ప్రస్తావించారు. ఆర్‌డబ్ల్యూఎస్, గ్రామీణాభివృద్ధిశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్‌కుమార్ పలాసలో ఇటీవల జరిగిన స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమానికి హాజరు కాగా.. ఆయన దృష్టికి కూడా తాగునీటి సమస్య తీసుకెళ్లారు. దీంతో ఉద్దానం రక్షితనీటి పథకంపై అధికారులను వివరాలు అడిగి ఆయన తెలుసుకున్నారు. ఈ మేరకు ఈ నెల 18న ఉద్దానం రక్షితనీటి పథకం వినియోగించుకోవచ్చని, ఐదు ఎంఎల్‌టీల నీరు ఇచ్చేందుకు ప్రభుత్వ ఉత్తర్వులు అందజేశారు. దీంతో జంట పట్టణవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- వాస్తవానికి టీడీపీ ప్రభుత్వ హయాంలో కేంద్రమంత్రిగా ఉన్న దివంగత నేత కింజరాపు ఎర్రన్నాయుడు కృషి మేరకు ఉద్దానం రక్షితనీటి పథకం మంజూరైంది. పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లో ఉన్న అన్నీ మండలాలకు నీరు ఇచ్చేందుకు చర్యలు తీసుకున్నారు. మొత్తం 276 గ్రామాలకు పూర్తిస్థాయి తాగునీరందించే ఈ పథకం మంజూరవగానే మూలన పడింది. పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీకి నీరందించడానికి అధికారులు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో ఈ పథకం మళ్లీ వెలుగులోకి (మిగతా 6వ పేజీలో..)



అక్కుపల్లి రోడ్డులో పైపులైన్ల అనుసంధానానికి మట్టిని తవ్వుతున్న మునిసిపల్ సిబ్బంది

సేంద్రియ పంటలు @ బలియాపుట్టుగ


దొండసాగుకు వేసిన పందిళ్లు

- రసాయన ఎరువుల వాడకానికి దూరం
- పంటల సాగుపై యువత ఆసక్తి
- ప్రభుత్వం సహకారం అందించాలంటూ వేడుకోలు

కంచిలి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి)

ప్రస్తుతం మనం పండించే ధాన్యం... కూరగాయలు... అన్నిటికీ రసాయన ఎరువులు వినియోగిస్తున్న విషయం తెలిసిందే. ఇవి మన ఆరోగ్యంపై వ్యతిరేక ప్రభావం చూపుతాయని తెలిసినా వీటి నుంచి బయట పడలేకపోతున్నాం. దీనికి భిన్నంగా ఎటువంటి రసాయన పదార్థాలు.. ఎరువులు ఉపయోగించకుండా... పూర్తిగా సేంద్రియ పద్ధతుల్లో కూరగాయలను సాగుచేస్తూ... సమీప గ్రామాల్లో వాటిని విక్రయిస్తూ తమ జీవనం సాగిస్తున్నారు కంచిలి మండలం బలియాపుట్టుగ వాసులు. ప్రజల ఆరోగ్యానికే తమ ప్రాధాన్యం అంటున్న ఈ గ్రామస్థులు పండించే పంటలకు ఉద్దానం గ్రామాల్లో మంచి డిమాండ్ ఉంటోంది.

కాయగూరలే ఆధారం..

మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న గ్రామం బలియాపుట్టుగ. ఇక్కడ సుమారు 90 ఇళ్లు ఉంటాయి. గ్రామ జనాభా 520కి పైబడి ఉంటుంది. వీరిలో చదువుకున్న యువతీ, యువకులు అధిక సంఖ్యలోనే ఉన్నారు. సుమారుగా 50 ఏళ్లుగా ఈ గ్రామానికి చెందిన వారు సమీపంలోని పొలాల్లో కాయగూరలు పండిస్తూ జీవనం సాగిస్తున్నా రు. గ్రామంలో నివసించే వారంతా సామంత కులస్థులు. కుటుంబంలోని చిన్నా, పెద్దా అందరూ కలిసి పొలాలను చదును చేసి, వాటిలో టమాటా, వంకాయలు, బెండ, బీర, దొండకాయ, ఆనపకాయ, దోసకాయ, కాకరకాయ, ముల్లంగి, క్యాబేజీ, మునగ వంటి కాయగూరలతో పాటు కందమూలం, కర్రపెండలం, మిరపకాయలు, గోంగూర, రాగి వంటి పంటలను పండిస్తుంటారు. అలాగే బంతిపూలు, కనకాంబరాలు వంటి పూలనూ అధికంగా పండిస్తున్నారు. గ్రామంలోని ఎక్కువ కుటుంబాలు కూరగాయల పంటలపైనేఆధార పడడం గమనార్హం. గతంలో ఇంటిల్లిపాదీ పంటల సాగుపై దృష్టి సారిస్తే ఇటీవల కాలంలో తల్లిదండ్రులు తమ పిల్లలను చదివించడంతో చాలా మంది మిలిటరీ, ఇతర ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్నారు. ఇప్పటికీ చదువుకుంటున్న యువతీ, యువకులు సైతం కూరగాయల సాగులో తమ తల్లిదండ్రులకు చేదోడుగా నిలుస్తున్నారు. కొండ దిగువన గ్రామం కావడంతో నీటి వనరులు అంతంత మాత్రంగానే ఉన్నాయని... ప్రభుత్వం ఆర్థికంగా చేయూత అందిస్తే, బోర్లు వేసుకుని తమ జీవితాలను మెరుగుపరచుకుంటామని వారు ఆశతో ఎదురుచూస్తున్నారు.


పాదులకు నీరు పోస్తున్న జనార్దన


బలియాపుట్టుగలో సాగులో ఉన్న క్యాబేజీ పంట

రసాయన ఎరువులకు దూరం..

కంచిలి, సోంపేట మండలాల్లో కాయగూరలు పేరు చెబితే బలియాపుట్టుగ గ్రామమే గుర్తుకువస్తుంది. ఈ గ్రామస్థులు తాము పండించిన కూరగాయలను అటు ఆదివారం, మంగళవారం సంతలతోపాటు పరిసర గ్రామాల్లో తిరిగి విక్రయిస్తుంటారు. ముఖ్యంగా సోంపేట పట్టణానికి వేకువజామున కాయగూరలను పట్టుకుని వెళ్లి, విక్రయాలు జరుపుతుంటారు. సోంపేట మార్కెట్‌లో బలియాపుట్టుగ గ్రామస్థులదే సింహభాగం. అధిక దిగుబడులు... త్వరగా పంట చేతికి రావడం కోసం వివిధ ప్రాంతాల్లో రసాయన ఎరువు లను ఎక్కువగా వాడుతుం టారు. దీనికి భిన్నంగా ఈ గ్రామస్థులు సేంద్రియ పద్ధతు ల్లోనే ఇప్పటికీ సాగు చేస్తున్నారు. దీనిలో కష్టానికి తగ్గ ఫలితం రాకపోయినా... రసాయనాల వైపు దృష్టి పెట్టేది లేదని తేల్చి చెబుతున్నారు. తమ పూర్వీకుల నుంచి వినియోగిస్తున్న కషాయాలు, ఘన, ద్రవ జీవామృతాలు, కుళ్లిన గత్తం (పశువుల పేడ తదితరమైనవి), సంప్రదాయ పందిళ్లనే నేటికీ వినియోగిస్తున్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి వద్దనే పంటలకు అవసరమైన కషాయాలను తయారు చేసుకుని, వాటినే ఉపయోగిస్తుంటారు. దిగుబడులు తక్కువగా వచ్చినా, నాణ్యమైన కాయగూరలు పండిస్తున్నారు. సంప్రదాయ పద్ధతు ల్లో సాగు చేయడంలో ఊరంతా ఒకే మాటపై ఏళ్ల తరబడి నిలబడటం విశేషంగా చెప్పవచ్చు.

ప్రభుత్వ సాయం శూన్యం..

గ్రామంలోని చదువుకున్న యువతీ, యువకులు సైతం కాయగూరల సాగులో తమ తల్లిదండ్రులకు సాయంగా పనులు చేస్తున్నారు. ఉదయం నుంచి పొలంలో కష్టపడితే తప్ప తమ జీవనం సాగడం లేదని, ప్రభుత్వం తమలాంటి వారికి కాస్తా చేయూత అందిస్తే, జీవనం మెరుగుపడుతుందని కోరుతున్నారు. గ్రామంలో ఉన్న వారంతా మధ్యతరగతి, సామాన్య వర్గానికి చెందినవారే. కొద్దిమంది బోర్లు వేసుకుని, పంటలు పండిస్తుంటే.... ఎక్కువ మంది గ్రామంలోని బావి నుంచి నీటిని తోడుకుని సాగు చేస్తున్నారు. రైతులకు ప్రభుత్వ సాయం అందడం లేదనిక... సబ్సిడీ రుణాలు అందించి ఆదుకోవాలని కోరుతున్నారు. సరైన ఉపాధి అవకాశాలు లేకపోవడం... దూర ప్రాంతాలకు వెళ్లేందుకు ఆర్థిక స్తోమత లేక ఇంటి వద్దనే తమ పిల్లలు కష్టపడాల్సి వస్తోందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కష్టానికి తగ్గ ఫలితం లేదు..

డిగ్రీ వరకు చదివా. తల్లిదండ్రులు లేరు. సోదరుల ఇంటి వద్ద ఉంటున్నాం. ఉదయం నుంచి కష్టపడి పనిచేస్తున్నా, ఫలితం ఉండటం లేదు. ఉపాధి కోసం టైలరింగ్ నేర్చుకున్నాం. వ్యవసాయంపై ఇష్టంతో పనులు చేసుకుంటున్నాం. ప్రభుత్వం సాయం చేస్తే మాలాంటి వారికి ఎంతో మేలు జరుగుతుంది.

-కె.విజయలక్ష్మి, సీత, బలియాపుట్టుగ

ప్రభుత్వ సాయం లేదు..

ఇంటర్ వరకు చదువుకున్నా. ఎలక్ట్రికల్ పని నేర్చుకుని చేస్తున్నా. సరైన పనులు లేవు. అందుకే భార్య, పాపతో పాటు అమ్మానాన్నలను పోషించుకునేందుకు వ్యవసాయం చేస్తున్నా. అప్పులు చేసి మోటారు బిగించుకున్నాం. మార్కెట్ సదుపాయం గానీ, ప్రభుత్వ సాయంగానీ శూన్యం. అధికారులు సైతం ఇటువైపు చూడటం లేదు.

-కల్లా జనార్దన, బలియాపుట్టుగ

మహిళామార్ట్‌లో అనకొండలు!

(ఐదో పేజీ తరువాయి)

అక్రమాలు జరిగాయనే విమర్శలున్నాయి. ముద్ర రుణాల పేరుతో ఎటువంటి వ్యాపారాలు లేనివారికి కూడా సిఫారసు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఇలా మండల మహిళ సమాఖ్య, వెలుగు, సెర్ఫ్ కార్యక్రమాల్లో అక్రమాలు జరిగినట్లు తెలుస్తోంది.

షేర్ క్యాపిటల్‌ను లాభాలతో చెల్లించాలి..

నిధులు పక్కదారి పట్టించి.. మార్ట్‌ను నష్టాల్లో చూపించడంపై మహిళా సంఘాల సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మహిళా స్వయంశక్తి సంఘాల నుంచి వసూళ్లు చేసిన షేర్ క్యాపిటల్ మూలధనం వాటా రూ.110తోపాటు మూడేళ్లకు వచ్చిన లాభాలను కూడా సంఘాలకు చెల్లించాలని కోరుతున్నారు. స్వయంశక్తి సంఘాల సొమ్ముతో .. మండల సమాఖ్యలో సోకులు చేస్తున్నవారు వెంటనే జవాబు చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. గత రెండేళ్లకు చెందిన ఆదాయ వ్యయాలను బహిరంగంగా తెలియజేయాల్సిన బాధ్యత ఎంఎంఎస్‌కు ఉందని గ్రామసమాఖ్య సంఘాల సభ్యులు స్పష్టం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి అక్రమాలకు అడ్డుకట్ట వేసేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

- ఈ విషయంపై మార్ట్ ఏపీఎం మల్లేశ్వరరావు వద్ద ప్రస్తావించగా.. 'మార్ట్ నిర్వహణ ఏరియా కో-ఆర్డినేటర్, మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలోనే 2022 నుంచి కొనసాగుతోంది. మార్టులో అమ్మకాలు తగ్గడం, నిధుల వ్యవహారంపై పీడీ ఆదేశాల మేరకు దర్యాప్తు చేస్తున్నాం. సమగ్ర నివేదికను సిద్ధం చేసి అధికారులకు అందజేస్తామ'ని తెలిపారు.

కాలం చెల్లిన మందులు

(ఐదో పేజీ తరువాయి)

విభాగం అధికారులు మాట్లాడుతూ.. వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆల్ప్రాజోలమ్, ట్రెమడాల్ లాంటి సైకోటిక్ మందులు అనధికారికంగా విక్రయించడం నేరమన్నారు. తనిఖీల నేపథ్యంలో పలువురు మెడికల్ షాపులను మూసివేశారు. అధికారులు వెళ్లిపోయిన అనంతరం సాయంత్రం వాటిని తెరిచారు.

● మత్తు పదార్థాల నిర్మూలనకు కృషి

టెక్కలి డివిజన్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ యుగంధర్ విలేకరులతో మాట్లాడుతూ 'డీజీపీ ఆదేశాల మేరకు ఈ దాడులు నిర్వహిస్తున్నాం. పలాస, టెక్కలి రెవెన్యూ డివిజన్లలో నాలుగు షాపులను తనిఖీ చేశాం. పలాసకు సంబంధించి ఒక కేసు నమోదు చేశాం. హిరమండలంలో జయశంకర్ మెడికల్ స్టోర్, పాతపట్నంలో మధు మెడికల్ షాపు కూడా తనిఖీ చేశాం. యువత మత్తు పదార్థాలకు బానిసై బలవుతున్నారు. ప్రమాదకరమైన మందులు మత్తు మందుగా వినియోగిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. దీన్ని సమూలంగా నిర్మూలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. మెడికల్ షాపులో ఇటువంటి మందులు అమ్మేటపుడు బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలి. మందుల వివరాలు అందుబాటులో ఉంచాల'ని తెలిపారు. కార్యక్రమంలో రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ బర్ల ప్రసాదరావు, ఔషధ నియంత్రణ సహాయ సంచాలకులు చంద్రరావు, సీఐలు ఈశ్వరరావు, సింహాచలం, రామారావు, ఎస్‌ఐలు అశోక్, ఎండీ యాసిన్ పోలీసులు పాల్గొన్నారు.

తీరనున్న నీటి కష్టాలు

(ఐదో పేజీ తరువాయి)

వచ్చింది. ఇప్పటివరకు మున్సిపాలిటీలో 3 ఎంఎల్‌టీ నీరు ఇస్తుండగా కేవలం పబ్లిక్ కుళాయిలు, 1400 గృహాలకు రెండు, మూడు రోజులకోసారి నీరు అందిస్తున్నారు. 5 ఎంఎల్‌టీ నీరందిస్తే రెండుపూటలా తాగునీరు సరఫరాకు అవకాశం ఉంది.

రూ.63.50 లక్షలతో పైపులైన్లు..

ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్న ఉద్దానం రక్షితనీటి ట్యాంకులకు పైపులైన్లు అనుసంధానించడానికి మునిసిపాలిటీ రూ.63.50 లక్షల నిధులు వెచ్చిస్తుంది. దీనికి సంబంధించి షార్ట్ టెండర్లను వేశారు. వారం రోజుల వ్యవధిలో ఈ పనులు చేపట్టేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అక్కుపల్లి రోడ్డులో కాశీబుగ్గ పెట్రోలు బంకు వద్ద ఉన్న ఉద్దానం రక్షితనీటి పథకం ప్రధాన పైపులైన్‌ను కలిపేందుకు యత్నిస్తున్నారు. ఈ మేరకు కమిషనర్ ఎన్.రామారావు, ఇంజనీరింగ్ అధికారుల బృందం శుక్రవారం సాయంత్రం పైపులైన్లు వేయడానికి స్థలాలు పరిశీలించారు. కిలోమీటరు పొడవునా పైపులైన్ వేసి ఉద్దానం ట్యాంకులకు కలిపితే మొత్తం నీరు అందించవచ్చని కమిషనర్ విలేకరులకు తెలిపారు. కాగా తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేసిన ఎమ్మెల్యే శిరీషకు టీడీపీ నాయకులు వజ్జబాబూరావు, లొడగల కామేశ్వరరావుయాదవ్, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, మల్లా శ్రీనివాస్, బడ్డ నాగరాజు, సప్ప నవీన్, దడియాల నర్సింహులు, ఎ.రామకృష్ణ, జోగ మల్లి కృతజ్ఞతలు తెలిపారు.

ఆలోచింపజేసిన 'ఆశ కదరా శివ'

- సిక్కోలులో జాతీయ స్థాయి నాటిక పోటీలు ప్రారంభం

శ్రీకాకుళం కల్చరల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక బాపూజీ కళామందిర్‌లో శుక్రవారం జాతీయ స్థాయి నాటిక పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అనకాపల్లికి చెందిన షిరిడి సాయి వెల్ఫేర్ అసోసియేషన్ కళాకారులు ముత్యాలరావు దర్శకత్వంలో ప్రదర్శించిన 'ఆశ కదరా శివ' నాటిక ఆలోచింపజేసింది. ఈ నాటికలో తల్లిదండ్రులు ఎంతో కష్టపడి సంపాదించిన ఆస్తిపాస్తులను పంచిపెట్టిన తర్వాత అన్నదమ్ముల్లో గొడవలు తలెత్తుతాయి. దీంతో కన్నవారు దూరమవుతారు. తల్లిదండ్రులు మరణించిన తర్వాత వారి కోసం పిల్లలు ఆరాటపడతారు. కానీ అప్పటికే పరిస్థితి చేయి దాటిపోతుంది. మమతాను రాగాల విలువను చాటిన ఈ నాటికలో సావిత్రమ్మగా రాణి, కరుణగా శ్రీజ సాదినేని, రాఘవగా పి.ముత్యాలరావు, భాస్కర్‌గా శంకరరావు, గోపాలుగా గోవిందరావు నటించారు. ప్రారంభ కార్యక్రమంలో గుత్తు చిన్నారావు, సుగుణాకర్ రావు, కొంచాడ సోమేశ్వరరావు, బాడాన దేవభూషణ్, కొంక్యాన మురళీధర్, ఇప్పిలి శంకర్ శర్మ, మండవిల్లి రవి, పులఖండం శ్రీనివాసరావు, నక్క శంకరరావు, పార్థసారథి, మెట్ట పోలినాయుడు, సురేష్, వరలక్ష్మి, ఉషారాణి, పూజ, రాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.


'ఆశ కదరా శివ' నాటికలోని ఓ సన్నివేశం

పాలిటెక్నిక్‌తో భవితకు భరోసా

- దరఖాస్తుల స్వీకరణకు గడువు ఏప్రిల్ 15
- అదే నెల 30న పాలిసెట్


శ్రీకాకుళంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల

ఎచ్చెర్ల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి)

పాలిటెక్నిక్ కోర్సులకు డిమాండ్ పెరుగుతోంది. విద్యార్థులు ఈ కోర్సులపై దృష్టి పెడుతున్నారు. పాలిటెక్నిక్ కోర్సులు పూర్తి చేసిన వారికి ఉద్యోగం గ్యారెంటీ కావడంతో పదో తరగతి పూర్తయిన విద్యార్థులు ఈ కోర్సుల్లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ కోర్సుల్లో చేరేందుకు విద్యార్థులు ముందుగా పాలిసెట్ రాయాలి. ఇప్పటికే సాంకేతిక విద్యాశాఖ పాలిసెట్ నోటిఫికేషన్ కూడా విడుదల చేసింది. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో శ్రీకాకుళంలో రెండు, ఆమదాలవలస, టెక్కలి, సీతంపేటలో చెరొకటి వంతున మొత్తం ఐదు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు ఉన్నాయి. మరో నాలుగు ప్రైవేటు కళాశాలలు కూడా ఉన్నాయి. మొత్తం 9 పాలిటెక్నిక్ కళాశాలల్లో 2,163 సీట్లు ఉన్నాయి. వీటిలో ప్రభుత్వ కళాశాలల్లో 663 సీట్లు, ప్రైవేటు కళాశాలల్లో 1,500 సీట్లు ఉన్నాయి. పాలిటెక్నిక్ కోర్సు పూర్తయిన తర్వాత ఈసెట్ రాసి నేరుగా ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సరంలో చేరే అవకాశం కూడా ఉంది.


షెడ్యూల్ ఇదీ..

పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు పాలిటెక్నిక్ కోర్సుల్లో చేరేందుకు అర్హులు. ఆసక్తి గల విద్యార్థులు ఏప్రిల్ 15వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఏప్రిల్ 30న పాలిసెట్ నిర్వహించి, మే మొదటి వారంలో ఫలితాలు వెల్లడిస్తారు. ఎంట్రన్స్ రాసేందుకు ఓసీ, బీసీ విద్యార్థులు రూ.400 రూపాయలు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.100 ఫీజు చెల్లించాలి. తగిన ధ్రువపత్రాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలి. శ్రీకాకుళంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులకు సమాచారం అందించేందుకు హెల్ప్‌లైన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

ఉజ్వల భవిత..

ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో కంప్యూటర్స్, సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ తదితర కోర్సులు ఉన్నాయి. విద్యార్థులకు ఆసక్తి ఉన్న ఏ కోర్సులో చేరినా.. ఇష్టంగా చదివితే ఉజ్వల భవిత పొందవచ్చని నిపుణులు చెబుతున్నారు. డిప్లమో పూర్తిచేసిన వారు చాలా రంగాల్లో ఉన్నతంగా స్థిరపడ్డారు.

గడువులోగా దరఖాస్తు చేయాలి..



పాలిటెక్నిక్ కోర్సుల్లో చేరాలనుకున్న విద్యార్థులు పాలిసెట్ రాసేందుకు నిర్దేశించిన గడువులోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలి. ఏప్రిల్ 30న పాలిసెట్ నిర్వహిస్తారు. పాలిసెట్‌లో మంచి ర్యాంకు సాధించేందుకు విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదవాలి. పాలిసెట్ కోసం ఆసక్తి గల విద్యార్థులకు ఉచిత కోచింగ్ ఇవ్వనున్నారు.

-డాక్టర్ బి.జానకిరామయ్య, ప్రిన్సిపాల్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, శ్రీకాకుళం

తాగునీటి సమస్య పరిష్కారమెప్పుడు?

- ఖాళీ బిందెలతో మహిళల నిరసన

హిరమండలం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మేజర్ పంచాయతీ హిరమండలంలో తాగునీటి సమస్య పరిష్కారం కావడంలేదు. రక్షిత మంచినీటి పథకం కుళాయిల నుంచి పూర్తి స్థాయిలో గృహాలకు నీరు అందకపోవడంతో స్థానికులు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. గత నెలన్నర రోజులుగా కుళాయిల నుంచి సక్రమంగా నీరు సరఫరా కాకపోవడంతో పంచాయతీ ప్రజలు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం ఉదయం గాంధీనగర్ వీధికి చెందిన మహిళలు ప్రధాన రహదారిపైకి ఖాళీ బిందెలతో వచ్చి ఆందోళన చేపట్టారు. రోజురోజుకీ పంచాయతీలో తాగునీటి సమస్య తీవ్రమవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని నిరసన వ్యక్తం చేశారు. స్థానిక ఎస్‌ఐ ఎండీ యాసిన్ అక్కడికి చేరుకొని మహిళలకు నచ్చజెప్పారు. అధికారులతో మాట్లాడి ట్యాంకర్ ద్వారా నీటిని అందిస్తామని చెప్పారు. దీంతో వారు శాంతించారు. మధ్యాహ్నం హెల్పింగ్ హ్యాండ్స్ అసోషియేషన్ ద్వారా గాంధీనగర్ వీధికి పంచాయతీ అధికారులు ట్యాంకర్‌తో మంచినీటిని సరఫరా చేశారు.


ట్యాంకరు ద్వారా నీరు సరఫరా చేస్తున్న పంచాయతీ అధికారులు


తాగునీటి కోసం ఆందోళనకు దిగిన మహిళలు

రహదారుల పనుల్లో.. నాణ్యత పరిశీలన

(ఐదో పేజీ తరువాయి)

శుక్రవారం మెళియాపుట్టి మండలంలోని మామిడిగుడ్డి, దీనబంధుపురం, రాజపురం, బురదరామచంద్రపురం, ముఖందుపురం రహదారులను పరిశీలించామని క్వాలిటీకంట్రోలు ఈఈ హరికృష్ణ తెలిపారు. ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామన్నారు. ఆయనతోపాటు డీఈ సిమ్మన్న, ఏఈ శ్రీకాంత్ ఉన్నారు.

- మెళియాపుట్టి మండలంలో సుమారు రూ.25కోట్లతో ఐటీడీఏ ద్వారా పనులు చేస్తుండగా, ఐటీడీఏ ఇంజనీరింగ్ అధికారులు కాంట్రాక్టర్ల అవతారం ఎత్తడంపై విమర్శలు వెల్లువెత్తాయి. దీనిపై కొంతమంది అధికారపార్టీ నాయకులు అధిష్ఠానానికి, సీఎంవోకు ఫిర్యాదు చేసినట్టు తెలుస్తోంది. దీంతో ఇంజనీరింగ్ శాఖలో అలజడి రేగుతోంది. రెండు రోజులుగా క్వాలిటీ కంట్రోల్ అధికారులు కూడా రహదారుల పనులు పరిశీలిస్తుండడంతో ఆ అధికారిపై ఎటువంటి చర్యలు తీసుకుంటారనేది చర్చనీయాంశమవుతోంది.

'మిస్టర్ ఆంధ్రా' పోటీలకు ఎంపిక


పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో డీఎస్‌డీవో తదితరులు

శ్రీకాకుళం స్పోర్ట్స్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 23న పార్వతీపురంలో జరగనున్న మిస్టర్ ఆంధ్రా బాడీ బిల్డింగ్ పోటీలకు జిల్లా జట్టును ప్రకటించారు. స్థానిక కోడి రామ్మూర్తి స్టేడియంలో శుక్రవారం బాడీబిల్డింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.ప్రసాద్, వి.విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ నిర్వహించారు. ఎస్.వైకుంఠరావు (శ్రీకూర్మం), బి.అభి, డి.జగదీష్, డి.జయరాం, బి.శివమణి, కె.సుమంత్, బన్నీలు జట్టుకు ఎంపికైనట్టు ప్రకటించారు. ఎంపికైన క్రీడాకారులకు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి కె.శ్రీధర్, టీడీపీ కోశాధికారి తిరుమలరావు, ఎస్.సందీప్ కుమార్, చరణ్ తదితరులు అభినందించారు.

జిల్లా పోలీసులకు సేవా పతకాలు



ఎస్‌ఐ వైద్యభూషణ్ | ఎస్‌ఐ గఫూర్ | ఏఎస్‌ఐ రమేష్‌బాబు

శ్రీకాకుళంక్రైం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పోలీసు శాఖతో పాటు అగ్నిమాపక శాఖలో పనిచేస్తున్న పలువురు ఉగాది పురస్కారాలకు ఎంపికయ్యారు. జిల్లా నుంచి శ్రీకాకుళం వన్‌టౌన్ ఏఎస్‌ఐగా బి.రమేష్‌బాబుకి ఉత్తమ సేవా పతకం వరించింది. జిల్లా ట్రాఫిక్ రికార్డు బ్యూరో విభాగంలో పనిచేస్తున్న ఎస్‌ఐ వైద్యభూషణ్ నేతాజీకి, సీసీఎస్‌లో ఎస్‌ఐగా పనిచేస్తున్న ఎస్.గఫూర్, ఓడలరేవు సీఎస్‌పీఎస్ విభాగంలో ఎస్‌ఐగా పని చేస్తున్న జి.విలియమ్స్, డీఏఆర్‌లో ఏఎస్‌ఐగా పని చేస్తున్న వై.రామారావు, ఏఆర్ పీసీ ఆర్.మీరబాబు, సీసీఎస్‌లో పీసీగా పనిచేస్తున్న ఎ.విశ్వనాథం, జి.సిగడాంలో హెచ్‌సీగా పనిచేస్తున్న కె.నాగేశ్వరరావు, ఏఆర్‌లో హెచ్‌సీగా పనిచేస్తున్న సీహెచ్ విశ్వనాథం, భావనపాడులో సీఎస్‌పీఎస్‌లో పీసీగా పనిచేస్తున్న యు.లక్ష్మీపతికి సేవా పతకాలు వరించాయి. జిల్లా అగ్ని మాపక శాఖలో పలాస స్టేషన్ అధికారిగా పనిచేస్తున్న బి.సోమేశ్వరరావుకి, శ్రీకాకుళం ఫైర్ స్టేషన్ లీడింగ్ ఫైర్‌మెన్ బి.శృంగారినాయుడు, డ్రైవింగ్ ఆపరేటర్ షేక్ రహీమ్‌లకు కూడా సేవా పతకాలకు ఎంపికయ్యారు. అలాగే విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగానికి సంబంధించిన ఎస్‌ఐ ఎస్.అశోక్ చక్రవర్తి, కానిస్టేబుళ్లు ఇజ్జాడ ఈశ్వరరావు, పి.లక్ష్మీనారాయణలకు ఏపీ పోలీసు సేవా పతకాలు వరించాయి.

గౌతు శిరీషపై అసత్య వార్తలు

- 2023లో కోర్టును ఆశ్రయించిన టీడీపీ నేత
- పత్రిక ఎడిటర్‌కు రూ.2లక్షల జరిమానా విధించిన కోర్టు

శ్రీకాకుళం, మార్చి 21(ఆంధ్రజ్యోతి) పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషపై రెండున్నరేళ్ల క్రితం స్థానిక పత్రికల్లో అసత్యవార్తలు ప్రచురితమయ్యాయి. ఉద్దేశపూర్వకంగా తప్పుడు కథనాలు ప్రచురించి.. వాటిని సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారంటూ 2023లో విశాఖపట్నం కోర్టులో గౌతు శిరీష కేసు వేశారు. కోర్టులో కేసు విచారణ జరుగుతున్నప్పుడల్లా తన వాదనలు వినిపించారు. శుక్రవారం విశాఖపట్నం జూనియర్ డివిజనల్ అదనపు సివిల్ న్యాయాధికారి తీర్పును వెల్లడించారు. గౌతు శిరీషపై తప్పుడు ప్రచారం చేపట్టినందుకుగాను 'ప్రజాగళం మన చిక్కోలు' ఎడిటర్, పబ్లిషర్ చిగురువలస జగదీశ్వరరావుకు రూ.2లక్షలు జరినామా విధిస్తూ తీర్పు ఇచ్చారు. చాన్నాళ్ల నుంచి సోషల్ మీడియాలో తనపై జరుగుతున్న ప్రచారంపై వెనకడుగు వేయకుండా కోర్టులో పోరాడి ఎమ్మెల్యే శిరీష విజయం సాధించారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

లావేరు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం ఉదయం 10 గంటలకు ఎంపీపీ లుట్టు అమ్మాజమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరుగనున్నట్టు ఎంపీడీవో పి.వెంకటరాజు తెలిపారు. ఈ కార్యక్రమానికి జడ్పీటీసీతో పాటు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు విధిగా హాజరు కావాలని ఆయన కోరారు.

కిడ్నీ ఆసుపత్రిలో ఉద్యోగాలకు నోటిఫికేషన్

అరసవల్లి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): పలాసలోని కిడ్నీ పరిశోధనా కేంద్రం/సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో వివిధ విభాగాల్లో ఏడాది కాలానికి గాను ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఆసుపత్రి అదనపు డైరెక్టర్ అల్లు పద్మజ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రిసెప్షన్ కమ్ రిజిస్ట్రేషన్ క్లర్క్ ఒక పోస్టు, జీతం నెలకు రూ.18,500, డిగ్రీ విద్యార్హత ఉండాలి. డయాలసిస్ టెక్నీషియన్స్ ఆరు పోస్టులకు ఆ కోర్సులో డిప్లమా, కౌన్సిల్‌లో నమోదు కలిగి ఉండాలి. జీతం రూ.32,670, అలాగే సిఆర్మ్ టెక్నీషియన్-2 పోస్టులకు, జీతం నెలకు రూ.32,670, గుర్తింపు పొందిన సంస్థ నుంచి డీఎంఐటీ కోర్సు చేసి, కౌన్సిల్‌లో నమోదు చేసుకుని ఉండాలి. జనరల్ డ్యూటీ అటెండెంట్స్ మూడు పోస్టులకు గాను నెలకు రూ.15,000 జీతం, పదో తరగతి అర్హత కలిగి ఉండాలి. సెక్యూరిటీ గార్డు ఒక పోస్టులకు, జీతం నెలకు రూ.15 వేలు, పదో తరగతి అర్హత కలిగి ఉండాలని చెప్పారు. దరఖాస్తులను అదనపు డైరెక్టర్, సూపరింటెండెంట్ కార్యాలయం, కిడ్నీ పరిశోధనా కేంద్రం, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, పలాసకు వచ్చే నెల 6వ తేదీలోగా సమర్పించాలన్నారు.

60 మంది విద్యార్థులు గైర్హాజరు

గుజరాతీపేట, మార్చి 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో జరుగుతున్న పదో తరగతి పరీక్షల్లో భాగంగా శుక్రవారం ఇంగ్లీషు పరీక్ష జరిగింది. ఈ పరీక్షకు సంబంధించి రెగ్యూలర్‌లో 28,276 మందికి గాను 28,132 మంది విద్యార్థులు హాజరు కాగా 144 మంది గైర్హాజరయ్యారు. అదేవిధంగా ప్రైవేటుకు సంబంధించి 47 మందికి గాను 31 మంది హాజరు కాగా 16 మంది గైర్హాజరయ్యారు.

ఉపాధి లక్ష్యాలు సాధించాలి

జి.సిగడాం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం లక్ష్యాలు సాధించేలా ప్రతి ఒక్కరూ పనిచేయాలని డ్వామా పీడీ సుధాకరరావు సూచించారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మండలంలో రూ.21.69 కోట్ల చేపట్టిన ఉపాధి పనులకు సంబంధించి సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఎంపీడీవో రామకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ బి.సుధాకరరావు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా పలు సమస్యలను పలువురు పీడీ దృష్టికి తీసుకువచ్చారు. ఏపీడీలు పంచాది రాధ, లోకేష్, ఎఫ్ఎం స్వరూపారాణి, ఏపీవో చోళ్ల సత్యనారాయణ, ఎస్ఆర్‌పీ పున్నంనాయుడు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి

ఇచ్ఛాపురం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): వేసవిలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని బూర్జుపాడు ఎంపీటీసీ సభ్యులు దున్న గురుమూర్తి అధికారులను ప్రశ్నించారు. శుక్రవారం ఎంపీపీ బోర పుష్ప అధ్యక్షతన మండల సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. బూర్జుపాడు, డొంకూరు, చిన్న, పెద్దలక్ష్మీపురం, శివకృష్ణాపురం గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని వెంటనే పరిష్కరించాలని కోరారు. అజెండాలో పొందుపరిచిన అన్ని అంశాలపై సమీక్షించారు. అధికారులతో పనులు చేయించడంలో విఫలమైన ఎంపీపీ నైతిక బాధ్యత వహించాలని కేశుపురం ఎంపీటీసీ చక్రవర్తి డీసెంట్ అందజేసి వాకౌట్ చేశారు. జడ్పీటీసీ ఉప్పాడ నారాయణమ్మ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

బీలలో పర్యటించిన పర్యాటకశాఖాధికారి



పరిశీలిస్తున్న అధికారులు

సోంపేట, మార్చి 20(ఆంధ్రజ్యోతి): జిల్లా పర్యాటకశాఖాధికారి నడిమింటి నారాయణరావు బీల ప్రాంతంలో శుక్రవారం పర్యటించారు. బారువ కంబనుంచి, గొల్లగండి, ఇస్కలపాలేం, ఒంటూరు, కళింగపట్నం, ఇద్దువానిపాలెం బీచ్‌ను సందర్శించారు. ఈ ప్రాంతంలో పర్యాటకాభివృద్ధి చేసేందుకు ప్రభుత్వానికి నివేదికలు పంపుతానని తెలిపారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జ్ దాసరి రాజు, స్టేట్‌జాయింట్ సెక్రటరీ బైపల్లి ఈశ్వరరావు, బైపల్లి నేతాజీ, గండుపల్లి చిన్నరాజారావు ఉన్నారు.

24 నుంచి రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు

ఎచ్చెర్ల, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఫరీద్‌పేట గ్రామంలోని రంగనాథస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలను ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకు నిర్వహించేందుకు నిర్వాహకులు తెలిపారు. 24న వేకువజామున సుప్రభాత సేవతో కార్యక్రమం ప్రారంభమవుతుందని చెప్పారు. మూడు రోజుల పాటు విశేష పూజలు, హోమాలు, యాగాలు, రంగనాథస్వామి కల్యాణం నిర్వహిస్తారు. అలాగే సాంస్కృతిక కార్యక్రమాలు జరగనున్నాయి.

ఉన్నతాధికారి వచ్చినా అదేతీరు

- రిమ్స్‌లో మొరాయించిన ఎక్స్‌రే మెషిన్
- ప్రసూతివార్డు వద్ద పనిచేయని లిఫ్ట్
- డీఎంఈ సందర్శించినా షరామామూలే..

అరసవల్లి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని సర్వజన ఆసుపత్రి (రిమ్స్)కి వచ్చే రోగులకు అవస్థలు తప్పడం లేదు. అయితే ఉన్నతాధికారులు సందర్శించిన సమయంలోనూ అదేతీరు కొనసాగడంపై సర్వత్రా విస్మయం వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) డాక్టర్ రఘునందన్ శుక్రవారం రిమ్స్ ఆసుపత్రి సందర్శనకు వచ్చారు. ఆసుపత్రిలోని పలు విభాగాలను, వార్డులను ఆయన పరిశీలించారు. మెడికల్ డైరెక్టర్ స్థాయి అధికారి వచ్చినప్పుడు ఆసుపత్రిలో ఎటువంటి సమస్యలు కనబడకుండా ముందు జాగ్రత్తలు తీసుకుంటారు. కానీ శుక్రవారం మాత్రం రిమ్స్ ఆసుపత్రిలో ఎక్స్‌రే మెషిన్ పనిచేయడంలో ఇబ్బందులు తలెత్తి అది మొరాయించింది. దాంతో ఎమర్జెన్సీ వార్డులో గల ఎక్స్‌రే ప్లాంట్ వద్ద రోగులు ఎక్స్‌రేల కోసం పెద్ద ఎత్తున ఎగబడ్డారు. అలాగే ప్రసూతి వార్డు వద్ద గల లిఫ్ట్ గతకొద్ది రోజులుగా పనిచేయడం లేదు. ప్రసవం కోసం వచ్చిన గర్భిణులు.. ప్రసవం అనంతరం ఒకటో అంతస్తులో గల వార్డుకు తరలిస్తారు. కానీ ఇక్కడ లిఫ్ట్ పనిచేయకపోవడంతో రోగులు, వారి బంధువులు ఇబ్బంది పడుతున్నారు. డీఎంఈ వచ్చిన ఇక్కడి పరిస్థితి మారడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదీలావుంటే డీఎంఈ వస్తుండడంతో శుక్రవారం ఉదయం నుండే రిమ్స్ ఓపీ కౌంటర్ల వద్ద గల టీవీలు ఆకస్మాత్తుగా పనిచేయడంతో పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేశారు.



పనిచేయని ప్రసూతివార్డు వద్ద గల లిఫ్ట్



ఎమర్జెన్సీ వార్డు వద్ద గల ఎక్స్‌రే గది వద్ద వేచి ఉన్న రోగులు

మట్టి అక్రమ రవాణా



ట్రాక్టర్లపై మట్టిని తరలిస్తున్న దృశ్యం

సరుబుజ్జిలి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని రొట్టవలస, పాలవలస, పురుషోత్తపురం రెవెన్యూ పరిధిలోని భూముల్లో మట్టి మాఫియా జోరకందుకుంది. పొలాలు, చెరువు గర్భాలను ఇష్టారాజ్యంగా జేసీబీల ద్వారా తవ్వకాలు చేసి ట్రాక్టర్లు, టిప్పర్లు ద్వారా మట్టి తరలిస్తున్నారు. పబ్లిక్‌గా మట్టి తరలిపోతున్న సంబంధిత అధికార యంత్రాంగాలు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నాయన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నిబంధనలు ప్రకారం మట్టి తవ్వకాలు చేసే ముందు మైన్స్, రెవెన్యూ యంత్రాంగాల నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉన్నా ఇదెక్కడా అమలు కాలేదు. భారీ టిప్పర్లు, ట్రాక్టర్లు ద్వారా ఇరుకైన రహదారుల్లో మట్టి తరలించడం వల్ల ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమై దుమ్ము, దూళి అధికమై నానా అవస్థలు పడుతున్నామని, ఆయా గ్రామస్థులు తెలిపారు. అధికారులు స్పందించి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

రైతును రాజు చేయడమే ధ్యేయం



మాట్లాడుతున్న రామకృష్ణ

బూర్జ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): రైతును రాజును చేయడమే మార్క్‌ఫెడ్ ధ్యేయమని ఆ సంస్థ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణ అన్నారు. విజయవాడలోని అమ్మ కల్యాణ మండపంలో జరిగిన ఏపీ రాష్ట్ర సహకార మార్కెటింగ్ సమాఖ్య లిమిటెడ్ 12వ సర్వసభ్య సమావేశానికి ఆయన శుక్రవారం పాల్గొన్నారు. అనంతరం రామకృష్ణ మాట్లాడుతూ రైతును రాజును చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. సమావేశంలో మార్క్‌ఫెడ్ చైర్మన్‌బంగార్రాజు, ఎండీ మనిజీర్ జిలానీ, రాష్ట్ర సహకార సంఘాల కమిషనర్ ఎ.బాబు తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలు సాధించాలి

శ్రీకాకుళం కలెక్టరేట్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను దివ్యాంగులు అన్ని విధాలుగా వినియోగించుకుని జీవితంలో ఉన్నత లక్ష్యాలను సాధించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక జడ్పీ సమావేశ మందిరంలో దివ్యాంగుల కోసం శుక్రవారం నిర్వహించిన అర్జీల స్వీకరణ కారన్యక్రమంలో ఆయన జిల్లా నలుమూలల నుంచి వచ్చిన దివ్యాంగుల నుంచి వినతులను స్వీకరించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పనాధికారి కె.సుధ, నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి సాయికుమార్, జిల్లా నలుమూలల నుంచి దివ్యాంగులు తదితరులు పాల్గొన్నారు.

జీవన ప్రమాణాలు మెరుగుపడాలి

ఆమదాలవలస, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పరిచేందుకే పీ-4 సర్వే ప్రభుత్వం నిర్వహిస్తుందని సాధికార కమిటీ సభ్యుడు నాగళ్ల మురళీధర్‌యాదవ్ అన్నారు. శుక్రవారం పురపాలక సంఘంలోని 9, 10 వార్డులకు సంబంధించి వాంబే కాలనీలోని సర్వేపై అవగాహన కల్పించారు. కార్య క్రమంలో నోడల్ అధికారి వెంకటరావు, సచివాలయ సిబ్బంది, టీడీపీ నాయకులు మొయ్యి రమణ, కట్టమూరి చిన్నారావు, లంక నాగరాజు, షేక్ మాలిక్, వైకుంఠం, చిరంజీవి, కృష్ణకాంత్, గోపి తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

ఆమదాలవలస, మార్చి 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలో మౌలిక సదుపాయాల కల్పన టీడీపీతోనే సాధ్యమని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తమ్మినేని గీతాసాగర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని 14వ వార్డు పరిధిలోని లక్ష్మీనగర్ వీధిలో సీసీ రహదారులకు ఆమె శంకుస్థాపన చేసి మాట్లాడారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు సంపతిరావు మురళీ, నాయకులు గుడ్ల దుర్గా ప్రసాద్, బోయి బాల, కూన నాగు, బీవీ రమణమూర్తి, పొట్నూరు శివ, ఇన్‌చార్జి కమిషనర్ జాన్సన్, తదితరులు పాల్గొన్నారు.

240 మందికి వైద్య పరీక్షలు



రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

రణస్థలం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): పైడిభీమవరం పంచాయతీ పరిధి దేవునపాలవలస, ముక్కుపాలవలస గ్రామాల్లో రెండు రోజులుగా డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరిస్, నైస్ ఫౌండేషన్ సౌజన్యంతో జెమ్స్ ఆసుపత్రి సిబ్బంది ఉచితంగా వైద్య శిబిరం నిర్వహించారు. 240 మందికి చికిత్సలు అందించారు. రోగులకు ఉచిత వైద్య పరీక్షలు, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రెడ్డీస్ లాబొరేటరీస్ సిబ్బంది, నైస్ ఫౌండేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

అడవుల పరిరక్షణ మనందరి బాధ్యత

శ్రీకాకుళం అర్బన్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): అడవుల సంవరక్షణా బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జిల్లా అటవీశాఖాధికారి (డీఎఫ్) ఎస్.వెంకటేష్ పిలుపునిచ్చారు. ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లా అటవీశాఖ కార్యాలయంలో విద్యార్థులకు అడవులు, ఆహార భద్రతలపై చిత్రలేఖనం,క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏపి ఎన్.జి.సి.జిల్లా కోఆర్డినేటర్ గోవిందరావు,అటవీశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మెగా వైద్య శిబిరానికి స్పందన

పొందూరు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): పిల్లలవలస గ్రామంలో శుక్రవారం నిర్వహించిన మెగా వైద్యశిబిరానికి భారీగా గ్రామస్తులు, చుటుపక్కల గ్రామస్తులు తరలివచ్చారు. డీఎంఅండ్‌హెచ్‌వో ఆదేశాలమేరకు మండలంలో కింతలి, తాడివలస పీహెచ్‌సీ వైద్యులు నిర్వహించిన ఈ శిబిరంలో సుమారు వందమందికి పైగా రోగులు హాజరయ్యారు. వారిలో 34 మందికి రక్తపరీక్షలు నిర్వహించి చికిత్సలు నిర్వహించారు. శిబిరాన్ని సర్పంచ్ పోలినాయుడు ప్రారంభించారు.

ఇద్దరు కార్యదర్శుల సస్పెన్షన్

ఎచ్చెర్ల, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఫరీద్‌పేట పంచాయతీలో గతంలో కార్యదర్శులుగా పనిచేసిన ఎం.రాజేశ్వరి, పి.శ్రీనివాసరావులను సస్పెండ్ చేస్తూ జిల్లా పంచాయతీ అధికారి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. 2019-24 మధ్య కాలంలో ఈ పంచాయతీలో వీరు కార్యదర్శులు పనిచేశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం, రికార్డుల నిర్వహణ లేకపోవడం తదితర కారణాలతో వీరిపై వేటు విధించారు. ఈ కార్యదర్శులపై పంచాయతీకి చెందిన కొత్తకోట అమ్మినాయుడుతోపాటు పలువురు ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టి సస్పెండ్ చేశారు. ప్రస్తుతం రాజేశ్వరి భగీరథపురంలో, శ్రీనివాసరావు రాపాకలో విధులు నిర్వహిస్తున్నారు.

రిమ్స్ ఎముకల విభాగాధిపతిగా 'లుకలాపు'



ప్రసన్నకుమార్

అరసవల్లి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సర్వజన (రిమ్స్) ఆసుపత్రి ఎముకల విభాగాధిపతిగా జిల్లాకు చెందిన డాక్టర్ లుకలాపు ప్రసన్నకుమార్ నూతనంగా నియమితులయ్యారు. ఆయన గత 25 సంవత్సరాలుగా ఎముకల విభాగంలో వైద్యుడిగా విశేష సేవలందిస్తున్నారు. జిల్లాకు చెందిన వైద్యుడు ఒక విభాగానికి అధిపతిగా నియామకం కావడంపై పలువురు వైద్యులు హర్షం చేశారు.

రైతులకు తప్పని అవస్థలు

సరుబుజ్జిలి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): పెద్ద సవలాపురం రైతు సేవాకేంద్రం గ్రామ అగ్రికల్చర్ అసిస్టెంట్ గత కొద్దిరోజులుగా సెలవులో ఉండడం వల్ల కార్యాలయం సక్రమంగా తెరవక రైతులకు సమాధానం చెప్పేవారేలేరని ఆమదాలవలస వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బద్రి రామారావు శుక్రవారం తెలిపారు. చాలా మంది రైతులు ధాన్యానికి అమ్మేందుకు సంబంధించి షెడ్యూల్ కోసం కాళ్లరిగేలా తిరుగుతున్నా పట్టించుకున్నవారే కరువయ్యారని తెలిపారు. రైతు నమోదు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు చాలా మంది రైతులకు జరగలేదన్నారు. అధికారులు దర్యాప్తు చేయాలని కోరారు. ఇదే విషయమై వ్యవసాయాదికారి బి.పద్మనాభం వద్ద ప్రస్తావించగా.. సింధువాడ వీఏఏను ఇన్‌చార్జిగా నియిమించామన్నారు. కొత్తగా ధాన్యం టార్గెట్ అనుమతులు కోసం ఉన్నతాధికారులకు నివేదించామన్నారు.

మత్తుకు దూరంగా ఉండాలి

సరుబుజ్జిలి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): యువత మద్యం, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని స్థానిక ఏఎస్‌ఐ సి.హెచ్.చంద్రినాయుడు తెలిపారు. మత్తు పదార్థాలు వల్ల కలిగే నష్టాలపై పాలవలస, పురుషోత్తపురం గ్రామాల్లో యువతకు శుక్రవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ ధనుంజయరావు, డ్వాక్రా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

స్టేడియం పనులు వేగవంతం చేయాలి

అరసవల్లి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): జిల్లాకే తలమానికంగా నిలిచిన కోడి రామ్మూర్తి స్టేడియం పనులు వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గొండు శంకర్ ఏపీఎంఐడీసీ, శాప్ మేనేజింగ్ డైరెక్టర్ గిరీష్‌కు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే ఆయనకు శుక్రవారం వినతిపత్రం అందజేసి వివరించారు. అలాగే రూరల్ మండలం సింగుపురంలో నిర్మిస్తున్న నర్సింగ్ కళాశాల పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఏపీ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ఎండీ రోణంకి కూర్మనాథ్‌ను కలిసి నాగావళి నదీ పరీవాహక ప్రాంతాల్లో కరకట్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు.



చంద్రబాబు నుంచి బహుమతి అందుకుంటున్న శంకర్

- అలాగే ఏపీ లెజిస్లేటర్స్ ఆటల పోటీల్లో కబడ్డీలో శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ ప్రథమ స్థానం సాధించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నుంచి బహుమతి అందుకున్నారు. ఎమ్మెల్యే గొండు శంకర్ కబడ్డీలో ప్రథమ స్థానం, వాలీ బాల్ పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచి బహుమతు అందుకున్నారు.

కనీస వేతనాలు ఇవ్వాలి

అరసవల్లి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఆశ వర్కర్లకు కనీస వేతనాలు ఇవ్వాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షురాలు కె.నాగమణి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు డిమాండ్ చేశారు. అనంతరం డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద నోడల్ అధికారి రవిప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూని యన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.ధనలక్ష్మి, జి.అమరావతి, నాయకులు పిజయలక్ష్మి, ఎం.మణికుమారి, రాకోటి.సుజాత, కె.లీలావతి, చంద్రకళ, జి.కళ్యాణి, పి.సుహాసిని, సంతోషి తదితరులు పాల్గొన్నారు.

అక్షరాస్యత అర్హత పరీక్ష రేపు

శ్రీకాకుళం కలెక్టరేట్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): వయోజన విద్యాశాఖ ద్వారా ఉల్లాస్ కార్యక్రమంలో నమోదు కాబడిన వయోజనులకు అక్షరాస్యత పరీక్ష మార్చి 23వ తేదీన దేశవ్యాప్తంగా జరుగుతుందని వయోజన విద్య ఏడీ ముద్దాడ వెంకటరమణ తెలిపారు. జిల్లాలో 39,940 మంది ఈ కార్యక్రమంలో నమోదు అయ్యారన్నారు. గ్రామాల్లో గల స్వయం సహాయక సంఘాలలో గల సీసీలు, వీఏవోలు, అంగన్‌వాడీ టీచర్లు, ఇన్విజిలేటర్లుగా వ్యవహరిస్తారన్నారు. ఈ పరీక్షలు అన్ని గ్రామాల్లో గల 2840 అంగన్‌వాడీ కేంద్రాలలో నిర్వహిస్తామన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఏదైనా మూడు గంటలలో ఈ పరీక్ష రాయాల్సి ఉంటుందన్నారు. జిల్లాలో శతశాతం హాజరు నమోదుకు యువత, స్వచ్ఛంద సంస్థలు, ప్రజా ప్రతినిధులు కృషి చేయాలని ఆయన కోరారు.

గ్రంథాలయాల అభివృద్ధి నిర్ణయం హర్షణీయం

శ్రీకాకుళం కల్చరల్ మార్చి 21(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలను ఆధునీకరిస్తామని మంత్రి లోకేశ్ అసెంబ్లీలో ప్రకటించడం హర్షణీయమని పలువురు అన్నారు. శుక్రవారం సీఐటీయూ సమావేశం మందిరంలో జరిగిన ఉత్తరాంధ్ర జిల్లాల గ్రంథాలయ సిబ్బంది, పెన్షనర్ల సంయుక్త సమావేశం హర్షం వ్యక్తం చేశారు. స్థానిక సంస్థలు వసూలు చేస్తున్న గ్రంథాలయ సెస్సును నేరుగా జిల్లా గ్రంథాలయ సంస్థల అకౌంట్‌కు జమచేయాలని కోరారు. తూర్పుగోదావరి జిల్లాతో కలుపుకొని ఉత్తరాంధ్ర జిల్లాల గ్రంథాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా పి.మల్లేశ్వరరావు, కన్వీనర్‌తోపాటు పదిమందితో కమిటీని ఎన్నుకున్నారు.

రైల్వేగేట్ సమస్య పరిష్కరించండి

పొందూరు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): పొందూరు రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న రైల్వేగేట్ వద్ద నిత్యకృత్యంగా మారిన ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చొరవ చూపాలంటూ కొంతమంది ప్రయాణికులు తాడివలస, గోరింట, తుంగపేట సర్పంచ్‌లకు శుక్రవారం వినతి పత్రం అందించారు. వాహనాల రాకపోకలతో అత్యంత రద్దీగా ఉండే ఈ రైల్వేగేట్ పడుతుండడంతో నిత్యం ట్రాఫిక్‌జాం అవుతుండడంతో ఈగేటు మీదుగా రాకపోకలకు ప్రయాణికులు ఇబ్బందిపడుతన్నారన్నారు. ఈ గేట్ వద్ద ఫ్లైఓవర్‌గాని, అండర్‌వే బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు. దీనిపై తాడివలస సర్పంచ్ టి.మణమ్మ, గోరింట సర్పంచ్ చింతాడ శ్రీలక్ష్మి, తుంగపేట సర్పంచ్ పప్పల వెణుగోపాలరావును కలిసి వినతిపత్రం అందించారు.

పేదల సంక్షేమమే లక్ష్యం

అరసవల్లి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): పేద ప్రజల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా పీ-4 విధానాన్ని ప్రభుత్వం చేపట్టిందని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పీఎంజే బాబు అన్నారు. నగరంలోని రెండో డివిజన్‌లో ఇన్‌చార్జి అక్కేన రాజారావు, స్పెషల్ ఆఫీసర్ సృజన ఆధ్వర్యంలో స్థానిక ఆదివారంపేట కమ్యూనిటీ హాల్ వద్ద అవగాహన సదస్సు నిర్వహించారు.

పిల్లల పోషణ, చదువుపై శ్రద్ధ చూపాలి

సరుబుజ్జిలి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ పిల్లల విషయంలో పోషణ, చదువు రెండూ ముఖ్యమేనని, వాటిపట్ల ప్రత్యేక శ్రద్ధవహించాలని రొట్టవలస జడ్పీ హైస్కూల్ ఇన్‌చార్జి హెచ్ఎం ఎంవీ రమణమూర్తి అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. పాఠశాల ఆవరణలో బూర్జ ఐసీడీఎస్ సెక్టార్ పరిధిలో అంగన్‌వాడీ టీచర్లకు నిర్వహించిన ప్రత్యేక శిక్షణా శిబిరంలో శుక్రవారం ఆయన మాట్లాడారు.

ప్రమాదకరం



హెచ్చరిక బోర్డులు లేని అక్కుపల్లి-తోటూరు మలుపు

అక్కుపల్లి జంక్షన్ నుంచి వయా మెట్టూరు తోటూరు వరకు బీటీ రోడ్డులతో అనేక మలుపులు ప్రమాదాలకు నిలయాలుగా తయారయ్యాయి. మలుపుల వద్ద ఎటువంటి ప్రమాద హెచ్చరికలు లేకపోవడంతో ద్విచక్ర వాహనాలు స్పీడ్‌గా వస్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. తోటూరు తీరం పర్యాటకంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ఈ మార్గంలో నిత్యం వాహనాల రాకపోకలు అధికంగానే ఉంటున్నాయి. అధికారులు స్పందించి మలుపుల వద్ద స్పీడ్ బ్రేకర్లు, ప్రమాద సూచికలు ఏర్పాటు చేయాలని ఈ ప్రాంతవాసులు కోరుతున్నారు.

-వజ్రపుకొత్తూరు (ఆంధ్రజ్యోతి)

నిర్లక్ష్యం

కరోనా సమయంలో వ్యాధిగ్రస్థులను శ్రీకాకుళం రిమ్స్, పునరావాస కేంద్రాలను తరలించేందుకు ప్రభుత్వం అంబులెన్స్ లను కేటాయించింది. పాతపట్నానికి కేటాయించిన వాహనం ప్రస్తుతం నిరుపయోగంగా ఉంది. తహసీల్దార్ ఆధ్వర్యంలో ఉన్న ఈ అంబులెన్స్ ఆలనాపాలన పట్టించుకోకపోవడంతో ఎండకు ఎండి వానకు తడిచి పాడైపోతోంది. మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని పట్టణ వాసులు కోరుతున్నారు. తహసీల్దార్ ఎస్.కిరణ్‌కుమార్ వద్ద ప్రస్తావించగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

-పాతపట్నం (ఆంధ్రజ్యోతి)



నిరుపయోగంగా ఉన్న అంబులెన్స్

దుర్గంధం



పాఠశాల ఎదుట ప్రహరీకి ఆనుకుని ఉన్న చెత్త కుప్పలు

పరిసరాలు బాగుంటే ఆరోగ్యం బాగుంటుంది.. ఇది ప్రభుత్వ నినాదం.. అయితే పాత జగదేకపురం కాలనీకి ఈ నియమం వర్తించదు.. ఎందుకంటే పాఠశాల ఎదుట ప్రహరీకి ఆనుకుని పెంటకుప్పలు ఉండడంతో విద్యార్థులు నిత్యం దుర్వాసనతో సహవాసం చేస్తున్నారు. అలాగే ఇటునుంచి వెళ్లే ప్రజలు సైతం పాఠశాల వద్దకు వచ్చేసరికి ముక్కు మూసుకోవాల్సిందే. ప్రభుత్వం స్వచ్ఛఆంధ్ర కార్యక్రమం చేపట్టాలని ఆదేశిస్తున్నా ఇక్కడ మాత్రం అటువంటిదేమీ లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పెంట కుప్పలను తొలగించి శుభ్రత కార్యక్రమం చేపట్టాలని విద్యార్థులు కోరుతున్నారు.

-పలాస రూరల్ (ఆంధ్రజ్యోతి)

ప్రేమించి మోసగించిన వ్యక్తి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ అవతారం

జి.సిగడాం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మబలికి మోసం చేసిన వ్యక్తిని అరెస్టు చేసినట్టు జేఆర్ పురం సీఐ ఎం.అవతారం తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలను స్థానిక పోలీసు స్టేషన్‌లో ఆయన వెల్లడించారు. మండలం లో ఓ గ్రామానికి చెందిన యువతి ఈనెల 19న ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టి అదే గ్రామానికి చెందిన సిగటాపు కిరణ్‌ను అరెస్టు చేశారు. ఆ యువతి, కిరణ్ కొన్నేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి, ఇప్పుడు వేరే అమ్మాయితో వివాహానికి సిద్ధమయ్యాడు. ఈ విషయం తెలుసుకున్న ఆ యువతి అతడిని నిలదీసినా ఫలితం లేకపోయింది. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు దర్యాప్తు చేసి అతడిని అరెస్టు చేసి పొందూరు కోర్టులో హాజరుపరచగా వచ్చే నెల 3వ తేదీ వరకు న్యాయాధికారి రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు. సమావేశంలో ఎస్ఐ వై.మధుసూదనరావు, ఏఎస్ఐ రామకృష్ణ పాల్గొన్నారు.

వంశధార నదిలో గుర్తుతెలియని మృతదేహం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ

గార, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): కళింగ పట్నం పంచాయతీ శిలగాం గ్రామ పరిధిలో వంశధార నదిలో శుక్రవారం గుర్తుతెలి యని మృతదేహం ఉన్నట్టు స్థానిక వీఆర్వో జి.సింహాద్రి గార పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్ఐ ఆర్. జనార్దన్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. సుమారు 55 నుంచి 60 ఏళ్ల వయ సు ఉంటుందని, పురుషుడుగా గుర్తించడం జరిగిందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

ఆరు లీటర్ల సారాతో ఇద్దరి అరెస్టు

పలాస/పలాస రూరల్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): పెంటిభద్ర, శాసనం గ్రామాల్లో సారా అమ్ముతున్నట్టు వచ్చిన సమాచారంతో శుక్రవారం దాడి చేసి ఇద్దరిని అదుపులోకి తీసుకుని ఆరు లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్టు కాశీబుగ్గ ఎక్సైజ్ సీఐ కె.మల్లికార్జునరావు తెలిపారు. పెంటిభద్రలో సవర రాజ్‌కుమార్, శాసనంలో కుప్పిలి నారాయణ చెరో 3 లీటర్ల చొప్పున సారా విక్రయిస్తూ పట్టుబడ్డారన్నారు. నిందితులను పలాస కోర్టులో హాజరుపరిచినట్టు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ షేక్ సైదా, పోలీసులు పాల్గొన్నారు.

20 సీసాల ఒడిశా మద్యం పట్టివేత

కవిటి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఒడిశాలో కొనుగోలు చేసి ఆంధ్రాకు తరలిస్తున్న 20 బీరు సీసాలతో ఒకరిని పట్టుకున్నట్టు ఇచ్ఛాపురం ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ పి.దుర్గాప్రసాద్ తెలిపారు. శుక్ర వారం కొజ్జిరియా వద్ద తనిఖీలు చేస్తుండగా ఎం.విజయ్ అనే వ్యక్తి ఒడిశా మద్యంతో కారులో వస్తూ పట్టుబడ్డాడన్నారు. అతడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ వి.రమణారావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో బోల్తా: ముగ్గురికి గాయాలు

కంచిలి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): పురుషోత్తపురం జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం ఆటో బోల్తాపడిన ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కంచిలికి చెందిన జగన్నాథం రాజు ఎలియాస్ రామకృష్ణ సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ చేస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. ఈ క్రమంలో పబ్లిసిటీ కోసం గోడలపై ఫోన్ నెంబర్లు రాసేందుకు మరో ఇద్దరితో కలిసి శుక్రవారం ఉదయం ఆటోలో వెళ్లాడు. కొన్ని గ్రామాల్లో పనిపూర్తి చేసి పలాస వైపు వెళ్తుండగా కుక్కలు అడ్డంగా రావడంతో ఆటో బోల్తా పడింది. ఈ ఘటనలో జగన్నాథంరాజుతో పాటు గేదెల దేవరాజు, జంగాల జగన్నాథం గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం సోంపేట ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ పి.పారినాయుడు తెలిపారు.

లారీ చోరీ.. ఒడిశాలో స్వాధీనం

ఇచ్ఛాపురం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధి ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో గురువారం రాత్రి పార్కింగ్‌లో ఉన్న ఓ లారీని ఆగంతకులు దొంగలించుకుపోయారు. ఈ విషయం గుర్తించిన లారీ యజమాని వాసు శుక్రవారం పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు వెంటనే దర్యాప్తు ప్రారంభించారు. పట్టణంతో పాటు చుట్టు పక్కల గ్రామాలను వెతకడం మొదలుపెట్టారు. చివరికి ఒడిశా రాష్ట్రం పితాతోళి గ్రామంలో లారీని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడి కోసం గాలిస్తున్నట్టు పట్టణ ఎస్ఐ ముకుందరావు తెలిపారు.

ట్రాక్టర్‌లో తరలిస్తున్న గడ్డి దగ్ధం



బూర్జ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): లాభాం గ్రామం నుంచి విశాఖకు ట్రాక్టర్ తో తరలిస్తున్న వరిగడ్డి కొల్లివలస జంక్షన్ వద్ద షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైంది. విద్యుత్ తీగలు ఒకదానికొకటి తగిలి నిప్పులు రాలడంతో మంటలు చెల రేగాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

యువకుడి ఆత్మహత్య



నందిగాం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): హరిదాసుపురం గ్రామానికి చెందిన అక్కురాడ ఢిల్లేశ్వరరావు(37) శుక్రవారం సాయంత్రం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామ సమీపంలోని తోటలో చెట్టుకు ఉరివేసుకున్నాడు. స్థానికులు గుర్తించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఘటనా ప్రాంతానికి చేరుకు న్నారు. ఢిల్లేశ్వరరావు భార్య సుశీలకు ఇలాగే చనిపోతున్నానంటూ ఫోన్ చేసినట్లు తెలిసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ షేక్‌మహ్మద్ ఆలీ తెలిపారు. ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. మృతుడి తల్లి గతంలోనే మృతిచెందగా, తండ్రి కరువులు, ఇద్దరు సోదరులు, ఇద్దరు కుమార్తెలున్నారు.

సారా రహిత గ్రామాలుగా తయారు చేయాలి



మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్

మెళియాపుట్టి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): సారా రహిత గ్రామాలుగా తయారు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం అంపురంలో నవోదయం 2.0పై అవగాహన కల్పించారు. సారా తయారు చేసిన వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏటీఎఫ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుబాబు, తహసీల్దార్ పాపారావు, ఎంపీడీవో ప్రసాద్‌పండా, ఎక్సైజ్ సీఐ మీరాసాహెబ్, ఎస్ఐ రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తిచేయండి

● మంత్రి అచ్చెన్నాయుడు



కొత్తపేట కొండపైకి ద్విచక్ర వాహనంపై వెళుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి మార్చి21(ఆంధ్రజ్యోతి): రహదారులే అభివృద్ధి సోపానాలని.. అందువల్ల ప్రారంభించిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. కొత్తపేట పంచాయతీ పరిధిలోని కొండపై ఉన్న పోలీస్ రిపీటర్ స్టేషన్‌కు చేపట్టిన సీసీ రోడ్డు పనులను శుక్రవారం పరిశీలించారు. అలాగే జాతీయ రహదారి నుంచి హుద్‌హుద్ బిల్డింగ్‌ల నుంచి ఎలమంచిలి వరకు చేపట్టిన రోడ్డు, హుద్‌హుద్ భవనాలను పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిం చారు. వ్యవసాయమార్కెట్ పరిధిలో అవసరమైన పనులపై సమీక్షించి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. కొత్తపేట కొండపైకి ఆయన బుల్లెట్‌పై వెళ్లి పనులను పరిశీలించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కింజరాపు హరిప్రసాద్, టీడీపీ నేతలు బోయిన గోవిందరాజులు, రమేశ్, మాజీ ఎంపీపీ తర్ర రామకృష్ణ, తహసీల్దార్ అప్పలరాజు పంచాయతీరాజ్ ఏఈలు రామనాథం, కె.రంజిత్ కుమార్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రతీ ఒక్కరూ పనిచేయాలని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. స్థానిక ఎన్టీఆర్ భవన్‌లో శుక్రవారం ప్రజాదర్బార్ నిర్వహించి వినతులు స్వీకరించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి గ్రామాల్లో సీసీ రోడ్లు, ప్రభుత్వ భవనాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.

నియామక పత్రాల అందజేత

నందిగాం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మూడు పంచాయతీలకు ముగ్గురు ఫీల్డ్ అసిస్టెంట్లకు నియామక పత్రాలను మంత్రి అచ్చెన్నాయుడు అందజేశారు. ఈ మేరకు శుక్రవారం కోటబొమ్మాళి కార్యాలయంలో కవిటి అగ్రహారం, ప్రతాప విశ్వ నాథపురం, దిమిలాడ పంచాయతీలకు నియమితులైన రొణగల వెంకట్రావు, పొనెల కృష్ణ, నడుపూరు రామ్మోహనరావులకు నియామక పత్రాలను అందించారు. ఉపాధి పనులు సక్రమంగా నిర్వహించేందుకు పాటు పడాలన్నారు. టీడీపీ నేతలు పి.అజయ్‌కుమార్, ఎం.బాలకృష్ణ పాల్గొన్నారు.

అసెంబ్లీ ప్రివిలైజ్ కమిటీ సభ్యుడిగా ఎంజీఆర్



పాతపట్నం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ శాసనసభ ప్రివిలైజ్ కమిటీ సభ్యుడిగా పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు నియమితుల య్యారు. ఈ మేరకు స్పీకర్ అయ్యన్న పాత్రుడు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా పలువురు టీడీపీ నేతలు, కార్యకర్తలు హర్షం వ్యక్తంచేస్తూ.. మామిడి గోవిందరావుకు ప్రివిలైజ్ కమిటీ సభ్యుడిగా నియమించి సముచిత గౌరవం లభించిందన్నారు. పార్టీ సేవలకు తగిన గౌరవం లభించిందని పలువురు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి లోకేష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

కంప్యూటర్ స్కిల్స్ పెంపొందించుకోవాలి

పలాస, మార్చి 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం తీసుకు వస్తున్న కొత్త విధానాలు, యాప్‌లపై సిబ్బంది కంప్యూటర్స్ స్కిల్స్ పెంపొందించుకోవాలని విశాఖపట్నానికి చెందిన మేక్స్ స్కాఫ్ సీఈవో అనిల్‌కుమార్, విశాఖపట్నం సీటీవో అనిల్‌కుమార్ కోరారు. మునిసిపల్ కార్యాలయంలో శుక్రవారం డివిజన్ పరిధిలో ఉన్న ప్రభుత్వశాఖల అధికారులు, కంప్యూటర్ ఆప రైటర్లకు శిక్షణ నిర్వహించారు. తహసీల్దార్ టి.కల్యాణ చక్రవర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

ఒడియా మీడియంలోకి మార్చాలి

హరిపురం మార్చి21 (ఆంధ్రజ్యోతి): సాబకోట గ్రామంలో ఒడియా మీడియం పాఠశాల ఉందని, అంగన్‌వాడీ కేంద్రాన్ని తెలుగుమీడియంలో నిర్వహిస్తుండడంతో చిన్నారులు తీవ్ర ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారని గ్రామ స్థులు ఆవేదన వ్యక్తంచేశారు. ఈ మేరకు శుక్రవారం ఎంఈవో ఎం.లక్ష్మణ రావుకు గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన పాఠశాలను పరిశీలించారు. వివరాలను సేకరించి సంబంధిత అధికారులకు తెలియజేయ నున్నట్లు తెలిపారు.

సాంకేతిక మార్పులపై అవగాహన అవసరం

టెక్కలి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మారుతున్న సాంకేతిక మార్పులపై అవగాహన కలిగి ఉండాలని చండీఘడ్ ఎన్ఐటీటీటీఆర్ డాక్టర్ సంజీవ్ మాన్‌హస్ అన్నారు. ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో వారం రోజుల పాటు అధ్యాపకులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిశ్రమలకు అనుసంధానంగా సైబర్ సెక్యూరిటీ, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, డేటా సైన్స్ తదితర అంశాలపై అవగాహన తప్పనిసరన్నారు. కార్యక్రమంలో డాక్టర్ అమిత్ డొయిగర్, డాక్టర్ సందీప్‌సింగ్, డాక్టర్ సోనో షోలంకితో పాటు డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసరావు, డీన్ డాక్టర్ శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ఎండవేడిమికి విద్యార్థుల అవస్థలు



టెక్కలి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఎండల తీవ్రత ఎక్కువవు తుండడంతో స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల పదో తరగతి పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. శుక్రవారం ఉదయం 8.45 గంటలకు కూడా విద్యార్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతించకపోవడంతో మండుటెండలో నిలుచోవాల్సి వచ్చింది. పరీక్ష కేంద్రం నిర్వహణ తీరుపై కొందరు తల్లిదండ్రులు ప్రశ్నించడంతో అనుమతించారు.

నిర్మానుష్యంగా రోడ్లు



నిర్మానుష్యంగా ఉన్న ఎల్ఎన్‌పేట కూడలి

ఎల్.ఎన్.పేట, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఎండలు తీవ్రతరం కావడంతో ప్రధాన రోడ్డుకు ఆనుకుని ఉన్న కూడళ్లు మధ్యాహ్నం నిర్మానుష్యంగా మారుతున్నాయి. తురకపేట జంక్షన్, లక్ష్మీనర్సుపేట జంక్షన్, మోదుగవలస జంక్షన్‌లు శుక్రవారం ఎండ తీవ్రతకు జనసంచారం లేక వెలవెల బోయాయి. దుకాణాలను సైతం మూసివేశారు.

అడవులను కాపాడితేనే భవిష్యత్

సంతబొమ్మాళి/పలాసరూరల్/పాతపట్నం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణలో భాగంగా అడవులను కాపాడుకోవడం ద్వారానే భవిష్యత్ ఉంటుందని పలువురు వక్తలు అన్నారు. ప్రపంచ అటవీ దినోత్సవాన్ని బోరుభద్ర, బ్రాహ్మణతర్లా, పాతపట్నం ఉన్నత పాఠశాలల్లో శుక్ర వారం నిర్వహించారు. అడవులను సంరక్షించడం వల్ల కలిగే లాభాలను ఉపాధ్యాయులు వివరించారు. బోరుభద్రలో ర్యాలీ చేపట్టారు. బ్రాహ్మతర్లాలో విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. పాతపట్నం జోగికొండను విద్యార్థులను అటవీ ప్రాంతానికి తీసుకువెళ్లి అవగాహన కలిగించారు. కార్యక్రమాల్లో హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'తంపర'పై కల్వర్టు నిర్మాణంతో పంటలకు ముప్పు


● ఆందోళన చెందుతున్న రైతులు



విష్ణుచక్రం వద్ద నిర్మిస్తున్న కల్వర్టు

సంతబొమ్మాళి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టుకు టెక్కలి నుంచి వేస్తున్న రోడ్డులో భాగంగా విష్ణుచక్రం గ్రామం వద్ద నిర్మిస్తున్న కల్వర్టుతో వరద ముంపు పొంచి ఉందని మండలానికి చెందిన రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. సంతబొమ్మాళి, కోటబొమ్మాళి, టెక్కలి, నందిగాం, మెళియాపుట్టి, పాతపట్నం, సారవకోట, జలుమూరు మండలాల నుంచి వరదనీరు కాకరాపల్లి తంపర గుండా సముద్రంలోకి కలుస్తోంది. అయితే పోర్టుకు కొత్తగా కల్వర్టు తంపరకు అనుకొని నిర్మిస్తుండంతో వరదనీటి ప్రవాహం సక్రమంగా జరగక సుమారు 6 వేల ఎకరాల పంట పొలాలకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. కల్వర్టు నిర్మాణాన్ని కాకరాపల్లి సర్పంచ్ పల్లి జోగారావు, రైతుసంఘ ప్రతినిధి కోత మధు, మత్స్యకార సంఘ ప్రతినిధి హనూరావు శుక్రవారం పరిశీలించారు. కల్వర్టు నిర్మాణం వల్ల పంట పొలాలు వరద ముంపులో చిక్కుకుపోతాయన్న విషయాన్ని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు దృష్టికి వారు తీసుకువెళ్లారు. వెంటనే మంత్రి అచ్చెన్నాయుడు పోర్టు అధికారులతో మాట్లాడారు. శనివారం రైతులు, పోర్టు అధికారులు కల్వర్టు ప్రాంతాన్ని పరిశీలించనున్నారు.

లైంగిక నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ న్యాయాధికారి

టెక్కలి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): లైంగిక నేరాలపై పిల్లలు అప్రమత్తంగా ఉండాలని సీనియర్ సివిల్ న్యాయాధికారి జె.శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం బన్నువాడలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. పిల్లలపై లైంగిక నేరాలకు పాల్పడడం చట్టరీత్యా నేరమని, అటువంటి వారిపై కఠినచర్యలు తీసుకుంటారన్నారు. 18 ఏళ్ల లోపు పిల్లలపై జరుగుతున్న అకృత్యాలను అడ్డుకోవడం, వారిని లైంగిక వేధింపుల నుంచి కాపాడడం కోసం ప్రభుత్వం పోక్సో చట్టాన్ని రూపొందించిందన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దివ్వల వివేకానంద, న్యాయవాదులు మధుబాబు, బాలకృష్ణ, ఆనందరావు, ఎస్ఐ రాము, సర్పంచ్ మోహనరావు, ఎంపీటీసీ ఫాల్గుణరావు, నీటి సంఘం అధ్యక్షుడు మురళీధర్ పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతో మెలగాలి



మాట్లాడుతున్న న్యాయాధికారి మణి

కొత్తూరు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు సత్ప్రవర్తనతో మెలిగి ఉన్నత శిఖరాలు అందుకోవాలని జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎస్.మణి అన్నారు. శుక్రవారం వసప కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. బాలికలు లైంగిక వేధింపులకు గురైతే వాటిని ఎదుర్కొనేలా అప్రమత్తంగా ఉండాలన్నారు. ధైర్యంగా సంబంధిత అధికారులకు తెలియజేయాలని, అటువంటి వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకుంటారన్నారు. కార్యక్రమంలో బార్ అసోషియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యద ర్శులు ఎం.అప్పారావు, వలురౌతు సుధాకరరావు, న్యాయవాదులు రెడ్డి ఉమామహేశ్వరావు, గేదల ఫల్గుణరావు, అరుబోలు ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

విప్లవయోధుడు అప్పలసూరి

నరసన్నపేట, మార్చి 21(ఆంధ్రజ్యోతి): పేదల పక్షాన పోరాటం చేసి దోపిడీదారుల నుంచి కాపాడిన విప్లవ యోధుడు మామిడి అప్పలసూరి అని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు నేతింటి నీలంరాజు అన్నారు. శుక్రవారం మామిడి అప్పలసూరి 28వ వర్ధంతి సందర్భంగా కోమర్తిలోని అమరవీరుల స్థూపం వద్ద నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఇఫ్టూ నాయకుడు ఎం.క్రాంతి, జామాన వెంకట్రావు పాల్గొన్నారు. మధ్యాహ్నం సీపీఐ ఎంఎల్‌న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాశ్, కృష్ణవేణి నివాళి అర్పించారు.

మాదకద్రవ్యాలు విక్రయిస్తే కఠిన చర్యలు

జలుమూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): గంజాయి వంటి మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలు విక్రయించినా, రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ అశోక్‌బాబు అన్నారు. చల్లవానిపేట కూడలిలో శుక్రవారం డాగ్‌స్క్వాడ్ బృందంతో దుకాణాల్లో తనిఖీ చేపట్టారు. మత్తు పదార్థాలు సేవించడం వల్ల కుటుంబాలు వీధినపడుతున్నారన్నారు.

వసపను వీడని ఏనుగులు

కొత్తూరు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): కొత్తూరు మండలం వసప గ్రామ పంట పొలాల్లో గత తొమ్మిది రోజులుగా ఏనుగులు సంచరిస్తూ వాణిజ్య పంటలకు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయి. నాలుగు ఏనుగులు గుంపు జొన్న, సారికంద, చెరకు, పుచ్చకాయ, నూలు చేలతో పాటు మోటార్లను ధ్వంసం చేసి వసప, కుంటిభద్ర గ్రామాల రైతులకు నష్టం మిగిలిస్తున్నాయి. ఏనుగులకు ఈ ప్రాంతంలో పుష్కలమైన నీరు, ఆహారం లభిస్తుండడం ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా ఇక్కడే తిష్ట వేశాయి. నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

న్యూస్ బాక్స్

నేడు ప్రజాదర్బార్

వజ్రపుకొత్తూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శనివారం ఎమ్మెల్యే గౌతు శిరీష ప్రజాదర్బార్ నిర్వహిస్తారని ఎమ్మెల్యే కార్యాలయం ప్రతినిధి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి ప్రజలు సమస్యలను విన్నవించుకోవచ్చన్నారు. అంతకు ముందు చినవంక పంచాయతీ తాడివాడలో ఉపాధి పనులను ఎమ్మెల్యే ప్రారంభిస్తారన్నారు.

మండల సమావేశం..

నరసన్నపేట, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో బి. మధుసూదనరావు ఒక ప్రకటనలో తెలిపారు. గత సమావేశంలో సభ్యులు సూచించిన విషయాలపై సమగ్ర నివేదికతో అధికారులు హాజరు కావాలని సూచించారు.

బెట్టింగ్ యాప్స్‌కు వ్యతిరేకంగా ర్యాలీ

కాశీబుగ్గ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): బెట్టింగ్, లోన్ యాప్స్‌కు వ్యతిరేకంగా శనివారం అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు గ్రీన్ ఆర్మీ, ఏపీ ఎన్‌జీవోస్ అధ్యక్షుడు గోపాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు పలాస ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి కాశీబుగ్గ పాత బస్టాండ్ వరకు ఈ ర్యాలీ చేపడుతున్నామన్నారు. ర్యాలీలో ప్రతి ఒక్కరు పాల్గొనాలని కోరారు.

సామాజిక తనిఖీ ప్రజావేదిక..

కొత్తూరు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో శనివారం ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వి.నీరజ తెలిపారు. 43 పంచా యతీల్లో చేపట్టిన ఉపాధి పనులపై గ్రామాల్లో సామాజిక తనిఖీ నిర్వహించారని, ఈ తనిఖీలపై ప్రజావేదికలో ప్రకటిస్తారన్నారు.

రేపు రగ్బీ జట్ల ఎంపికలు

టెక్కలి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఆదివారం ఉదయం 9గంటలకు రగ్బీ పురుషుల, మహిళల జిల్లా జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు డొంకాన రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి పొన్నాడ పార్వతీశం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు ఆధార్ కార్డు, పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం తీసుకొని రావాలన్నారు. ఎంపికైన జట్లు కర్నూలులో జరగనున్న ఏపీ రగ్బీ అసోసియేషన్ చాంపి యన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారన్నారు. ఇతర వివరాలకు జిల్లా రగ్బీ ఆర్గనైజింగ్ కార్యదర్శి 85000 07272, 78424 23423 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఈకేవైసీ తప్పనిసరి

నందిగాం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డుదారులు తప్పనిసరిగా ఈకేవైసీ చేసుకునేలా డీలర్లు చొరవ చూపాలని తహసీల్దార్ పి.సోమేశ్వరరావు అన్నారు. శుక్రవారం స్థానిక తహసీ ల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లు, ఎండీయూ వాహనదారులతో సమావేశం నిర్వహించారు. మండలంలోని 48 డిపోల పరిధిలో సుమారు 5వేల మంది ఈకేవైసీ చేసుకోవాల్సి ఉందన్నారు. ఈకేవైసీ చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఈ ప్రక్రియ 30వ తేదీ నాటికి పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో డీటీ ఆర్.రామారావు, సీఎస్ డీటీ అనిల్‌కుమార్ పాత్రో పాల్గొన్నారు.

రూ.2.97 లక్షలకు ఆశీలు ఖరారు

పాతపట్నం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మేజర్‌పంచాయతీ పాతపట్నంలో ఆశీలు వసూలుకు గాను శుక్రవారం డీఎల్పీవో ఆర్‌.గోపిబాల ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహించారు. పంచాయతీ కార్యాలయంలో జరిగిన వేలంలో రోజువారీ ఆశీలు వసూలుకు ధూళి నవీన్ రూ.1,97,700 పాట దక్కించుకున్నారు. అలాగే బస్టాండ్, కార్ స్టాండ్‌లకు రూ.1,84,00లకు ధూళి జ్యోతి, కమేళాకు రూ.29వేలకు మల్లా ధనంజయరావు పాడారు. ఇన్‌చార్జి ఈవో కిశోర్, ఈవోపీఆర్డీ ఎల్.వెంకటరావు పాల్గొన్నారు.

చొర్లంగిలో హైవోల్టేజీ

హిరమండలం,మార్చి21(ఆంధ్రజ్యోతి): చొర్లంగి గ్రామంలో శుక్రవారం విద్యుత్ హై ఓల్టేజీ వచ్చి పలు ఇళ్లలో విద్యుత్ ఉపకరణాలు పాడయ్యాయి. టీవీలు, ఫ్రిజ్‌లు, కుక్కర్లు కాలిపోయాయి. వీటి విలువ రూ.2 లక్షలు ఉంటుందని అంచనా.